J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 08.05.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 49 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## మందు కోసం మందలు...

# వైరస్‌తో చిందులు




- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మద్యం జాతర మొదలైంది!
- వైరస్ విజృంభిస్తున్న తరుణంలో మద్యం అమ్మకాలు అవసరమా?
- 40 రోజుల లాక్‌డౌన్ శ్రమ బూడిదలో పోసిన పన్నీరేనా?
- రేట్లు పెరిగితే మద్యం మానుతారనే పిచ్చి భ్రమలు సరైనవేనా?

ప్రధాని నరేంద్ర మోడీలా హావభావాలు ఒలికించకపోయినా, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌లా వాగ్ధాటి లేకపోయినా ఈ కరోనా వైరస్ కాలంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అత్యంత సమర్ధవంతంగా నడిపిస్తున్నాడని ఏపి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి ఎంతో మంచిపేరొచ్చింది. కేంద్రంతో సంబంధం లేకుండానే దక్షిణ కొరియా నుండి టెస్ట్‌కిట్‌లను తెప్పించి రాష్ట్రంలో టెస్టులను పెంచారు. టెస్ట్‌లు చేయడంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగంలో నిలిపారు. వలస కూలీలను వారి వారి రాష్ట్రాలకు తరలించడంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రశంసలందుకున్నారు. ఆరోగ్యంతో పాటు ఆర్ధికాభివృద్ధి కూడా అవసరమనే ముందుచూపుతో ఓ పక్క కరోనాను ఎదుర్కొంటూనే ఇంకోపక్క ఆర్ధిక రంగాన్ని నిలబెట్టడం కోసం ఆయన సూచించిన రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్‌ల విధానాన్నే కేంద్ర ప్రభుత్వమే అమలులోకి తెచ్చింది. (మిగతా 11వ పేజీలో)

## కరోనాకు..

# కమిట్ అవుతున్నారు



- అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు జగన్ బాటే పట్టాయి
- కరోనా ఇప్పట్లో పోదని నిర్ధారణకొస్తున్నారు

**కరోనాపై విజయం సాధిస్తాం... కరోనా మెడలు వంచుదాం... దాని దుంప తెంచుదాం... ఆ వైరస్‌ను ఖండఖండాలుగా నరికి కాకులకు, గద్దలకు వేద్దామని నిన్నటి వరకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నుండి సాధారణ ప్రజానీకం వరకు మాట్లాడారు. కాని రెండు నెలల కాలంలోనే అందరికీ కరోనా వైరస్ ప్రభావమేంటో, స్వభావమేంటో ఇప్పుడందరికీ అర్ధమవుతోంది. కరోనా వైరస్‌ను పూర్తిగా నియంత్రించడం, నిర్మూలించడం అసాధ్యం అని తేలిపోయింది. దీనికి వ్యాక్సిన్‌లు, ఔషధాలు రావాల్సిందే!**

ముందుగా విషయం వూహించాడు కాబట్టే ఏ.పి సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి... మనం కరోనాతో కలిసి సహజీవనం చేయకతప్పదన్నాడు. ఆయన మాటలకు చాలామంది పెదర్ధాలు తీశారు. కాని, ఈరోజు దేశ ప్రధాని నరేంద్ర మోడీతో సహా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా కరోనాతో రాజీపడుతున్నారు. ఈ వైరస్ ఇప్పట్లో పోదని, కొంతకాలం దీనితో పోరాడక తప్పదని అంటున్నారు. కాబట్టి కరోనాకు మందు లేదు... నివారణే మార్గం... ఆ దిశగా జాగ్రత్తలు పాటిద్దాం! లాక్‌డౌన్ ఆంక్షలు తొలగించిన తర్వాత కూడా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కొంత కాలం లాక్‌డౌన్ ఆంక్షలు పాటించక తప్పదు!



## విషవాయువుతో...

# విశాఖలో విషాదం

మృతులకు కోటి రూపాయల భారీ నష్టపరిహారం ప్రకటించిన సీఎం జగన్ 12లో

## కోవిడ్‌తో...

# భారత్‌కు కలిసొస్తుందా?



- పెద్ద సంఖ్యలో విదేశీ కంపెనీల పెట్టుబడులకు అవకాశం
- భూమితో పాటు మౌలిక సదుపాయాలు సిద్ధం

**సమర్ధుడి చేతికి బ్రేకులు ఫెయిల్ అయిన డొక్కు బస్సు ఇచ్చినా ప్రయాణీకులను సురక్షితంగా గమ్యానికి చేరుస్తాడు. అసమర్ధుడి చేతికి మంచి కండీషన్‌లో వున్న వోల్వో బస్సును ఇచ్చినా ఎక్కడో చోట పల్టీకొట్టిస్తాడు. నాయకత్వ పటిమ కూడా ఇలాంటిదే! డొనాల్డ్ ట్రంప్ అసమర్ధ నాయకత్వం అమెరికాను కరోనా వైరస్ బారినపడేలా చేస్తే, నరేంద్ర మోడీ సమర్ధవంతమైన నాయకత్వం భారతదేశాన్ని ఆ వైరస్ బారి నుండి చాలావరకు కాపాడగలిగింది.**

అమెరికా అగ్రరాజ్యమే... కాని నాయకత్వలోపం ఆ దేశానికి శాపమైంది. భారత్ అభివృద్ధి చెందుతున్న దేశమే... అయినా మోడీ నాయకత్వం కరోనా వైరస్‌ను ఎదుర్కొనే క్రమంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెట్టింది. ఈ కరోనా వైరస్‌పై పోరాటమే భారత్ దిశను దశను మార్చబోతుందా? నరేంద్రమోడీ నాయకత్వంలో సరికొత్త భారతం ఆవిష్కరించబోతుందా? కరోనా వైరస్‌తో అన్ని దేశాలు నష్టపోతే, భారత్ మాత్రం లాభపడనుందా? ఈ ప్రశ్నలన్నింటికీ త్వరలోనే సమాధానాలు రాబోతున్నాయి. కరోనా వైరస్ జన్మస్థానం చైనా ప్రపంచ దేశాల నమ్మకాన్ని కోల్పోయింది. అమెరికాతో సహా యూరప్ దేశాలన్నీ (మిగతా 11వ పేజీలో)

# రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచిన జగనన్న

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**

రాష్ట్రం ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా నిలుస్తున్నారని, కరోనా మహమ్మారి.. లాక్‌డౌన్‌ల నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకూడదని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగనన్న అమలుచేస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొనియాడారు. ఈనెల 2న పెళ్లకూరు మండలంలోని అక్కగారిపేట గ్రామంలో జడ్పీటిసి సభ్యురాలు ప్రిస్కిల్లా తన సొంత నిధులతో పేదలకు కూరగాయలు, కోడిగుడ్లు, పాలు సరఫరా చేశారు. వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితో కలసి ఎమ్మెల్యే సంజీవయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని పేదలకు ఆ సాయం అందజేశారు. ఈ సందర్భంగా కిలివేటి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఫీజు రీయింబర్స్‌మెంట్, పెన్షన్, ఉచితంగా రేషన్ సరుకులతో పాటు అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలు అమలుచేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారన్నారు. అయితే చంద్రబాబునాయుడు మాత్రం ఇవన్నీ పట్టించుకోకుండా



వైయస్సార్సీపి పాలనపై లేనిపోని విమర్శలు చేస్తూ తమ పార్టీపై బురద చల్లుతున్నాడని ఆయన మండిపడ్డారు. అనంతరం ఆయన కలవకూరుకు వెళ్లి అక్కడ పార్టీ నాయకుడు అన్నంరెడ్డి సురేష్‌బాబురెడ్డి కుమారుడు సాయి అఖిల్ మృతిచెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# సైనిక దళాలకు ధన్యవాదాలు

**జిల్లా పోలీసు అధికారుల సంఘం**

ప్రస్తుతం ఉన్న కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆ మహమ్మారిపై ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న వైద్యులు, అధికారులు ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆకాశం నుంచి హెలికాప్టర్లు, విమానాలతో పూలవర్షం కురిపించిన సైనికులకు జిల్లా పోలీసు అధికారుల సంఘం ధన్యవాదాలు తెలియజేసింది. ఈనెల 3న నెల్లూరులో జిల్లా పోలీసు అధికారుల సంఘం వారు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు మాట్లాడుతూ కరోనాపై పోరాటం చేస్తున్న వైద్యసిబ్బంది, పోలీసులు, పారిశుధ్య సిబ్బంది, మీడియా చేస్తున్న త్యాగాలను గుర్తించి అందుకు అభినందిస్తూ త్రివిధ దళాలు విశాఖపట్నంలో ఆసుపత్రుల వద్ద పూలవర్షం కురిపించి సంఘీభావం తెలపడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఆ త్యాగధనుల సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినందుకు ఆనందంగా ఉందని, ప్రత్యేకించి పోలీసుశాఖకు లభించిన ఈ ప్రోత్సాహం పోలీసుల బాధ్యతలను మరింతగా పెంచిందన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ కరోనా మహమ్మారిని నివారించేందుకు అహరహం కృషిచేస్తామన్నారు. పోలీసు మిత్రులంతా కరోనాపై పోరాటంలో జాగ్రత్తలు పాటిస్తూ, ఆ వ్యాధిని కట్టడి చేసేందుకు మరింతగా అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం కార్యదర్శి ఎస్.సుబ్బరాజు, కోశాధికారి తురకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**జనసేన ఆధ్వర్యంలో**

# కూరగాయలు పంపిణీ



నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని నిప్పో సెంటర్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ తదితర ప్రాంతాలలో నివాసం ఉంటున్న 200 కుటుంబాల నిరుపేద ప్రజలకు జనసేన ఆధ్వర్యంలో సోమవారం కూరగాయల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపుతో, నెల్లూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మనుక్రాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో, స్థానిక డివిజన్ జనసేన నాయకులు శశికాంత్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకర విషయం అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న లాక్‌డౌన్ అభినందనీయమన్నారు. ఇటువంటి క్లిష్టతర, విపత్కర, ఆపత్కాలంలో నిరు పేద ప్రజలను, రోజువారీ కూలీలను, వలస కూలీలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ క్రమంలో జనసేన పార్టీ తన వంతు బాధ్యత వహిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం జనసేన నాయకులు గునుగుల కిషోర్ పర్యవేక్షణలో జరిగింది. జనసేన సైనికులు ప్రశాంత్, శశాంక్, సాయి తేజ, బాలాజీ, వినయ్, రాధిక, కృష్ణవేణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

**కిడ్నీ వ్యాధిగ్రస్తులకు**

# స్వర్ణభారత్ ట్రస్ట్ సాయం

వెంకటాచలంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటుచేసిన కిడ్నీ వ్యాధిగ్రస్తుల కేంద్రానికి ఈనెల 6 నుంచి స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులు భోజనం సరఫరా ప్రారంభించారు. పంచాయతీ విస్తరణాధికారి విజయకృష్ణ, సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ యూసఫ్ మహమ్మద్, స్వర్ణ భారత్ ట్రస్ట్ జిఎం నరసింహారావు, ట్రస్ట్ సమన్వయకర్త జనార్దనరాజు ఆహారం ప్యాకెట్లను బాధితులకు అందజేశారు.

# దేశానికే ఆదర్శ సిఎం వైయస్ జగన్

**సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి**

వలంటీర్ల వ్యవస్థ వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని, అలాంటి వ్యవస్థను తీసుకువచ్చిన రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 2న వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు ఎమ్మెల్యే నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరోనా వైరస్ నియంత్రణలో గ్రామ వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో సమాచారాన్ని వలంటీర్లు అందజేస్తుండడంతో అధికారులు వెంటనే కరోనా నివారణకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సరళ, నాయకులు కోడూరు ప్రదీప్ కుమార్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, హుస్సేన్, రాజానాయుడు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాకాణి చవటపాలెంకు వెళ్లి అక్కడ గ్రామ వలంటీర్ల ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద పలువురికి ఆహారపొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. చెంచుకృష్ణయ్య, వెంకటశేషయ్య, మురళీనాయుడు పాల్గొన్నారు.

# అన్నమేడులో ఎన్ఆర్ఐ దాతృత్వం

నాయుడుపేట మండల పరిధిలోని అన్నమేడు గ్రామంలో ఈనెల 2న పిగిలాం తిరుమలయ్య, రామసుబ్బమ్మల కుమారుడు ఎన్ఆర్ఐ పిగిలాం శ్రీనివాస్ దాతృత్వంతో 700 కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు తనవంతు సాయంగా 8 రకాల నిత్యావసర వస్తువులను, వాటితో పాటు కూరగాయలను కూడా అందించి తమ సేవాభావం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ కుటుంబసభ్యులు రమణయ్య, గణేష్, మల్లి జ్యోతి, శ్రీపతి కిరణ్‌కుమార్, బల్లి తిరుపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కావలిలో కరోనాపై అవగాహన

**- వినూత్నంగా గొడుగులతో ర్యాలీ**

కావలిలో వినూత్నమైన రీతిలో గొడుగులు వేసుకుని అధికారులు కరోనా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. టివిఎస్ మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో వందమందికి గొడుగులు పంపిణీ చేసి కరోనా వ్యాధి నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా కావలి మునిసిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అందరూ తప్పనిసరిగా సామాజిక దూరం పాటించాలని, గొడుగులు వేసుకోవడం ద్వారా దూరం పాటించవచ్చని చెప్పారు. కరోనా మహమ్మారిని నివారించడానికి అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు దామిశెట్టి సుధీర్‌నాయుడు, సభ్యులు రవిప్రకాష్, షమ్మారహీం పాల్గొన్నారు.

# నాకో వాగ్దానం కావాలి

మనిషి జాడ
ఇప్పుడు యముడు చేపట్టిన క్రీడ
మనిషి నీడ
గురిచూసి విసిరిన పులి పంజా
మనిషికి మనిషే
ప్రాణభిక్ష పెట్టాల్సిన విపత్కర క్షణాలివి
ఉరి శిక్ష అమలు జరిపే ముందు
ఘనీభవించిన మౌనంలా మనిషి
ఓ గూటి కింద పుష్పగుచ్ఛమై
పలకరించుకునే కుటుంబ సభ్యుల మధ్య
యోజనాల ఎడబాటు
కనపడని క్రిమి కిరాతకత్వానికి
శోకసంద్రమైన లోకం
క్షితిజ రేఖలో కళ్ళు కలిసేచోట
నమ్మకాన్ని మొలిపించుకోగలగాలి
సమీకృత సమూహపు దారి నుంచి
మనిషి ఆకాశమై ఒంటరిగా మొలకెత్తాలి
చీకటి చారికల సామ్రాజ్యాన్ని ధ్వంసం చేసి
నక్షత్రాల బాట వేయాలి
కళ్ళల్లో వెలుతురు పూలు పూయించాలి
ఆకలి దప్పుల కన్నా మనిషికి
స్వేచ్ఛా వాయువులే ఊపిరిపోసే వెంటిలేటర్లు
వైతాళిక గీతాలు పాడుతూ సాగే పక్షుల్లా
నిర్మలంగా నీటిలో ఈదే చేపపిల్లల్లా
ఎగిరిగంతేయ గలగాలి
తెగిపోయిన రహదారులన్నీ
పాదాలతో అతికించాలి
మనిషి కింద మంటలా ఎగిసిపడే
పొగల సెగల నుంచి ఉవ్వెత్తున దూకే
సునామి విలయంలాంటి
వైరస్ పరిష్వంగం నుంచి
జీవితానికి విముక్తి కావాలి
జీవించినన్నాళ్ళు
జీవించడం కావాలి
కాలం నుంచి
నాకో వాగ్దానం కావాలి
కరోనాకు చరమగీతం పాడాలి.



**- చిన్ని నారాయణరావు**
9440202942



# వలస కార్మికుల రైలు పట్టాలెక్కింది

## - తొలిరోజు రైలులో 1200 మంది ప్రయాణం

ఎట్టకేలకు వలస కార్మికుల రైలు పట్టాలెక్కింది. కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో తాము స్వస్థలాలకు వెళ్తామో లేదోనని బిక్కుబిక్కు మంటున్న వేలాదిమంది వలస కార్మికులు ఆ సమస్య నుంచి గట్టెక్కుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధికోసం వచ్చి లాక్‌డౌన్‌తో ఇక్కడే ఉండిపోయిన వలస కార్మికులను స్వస్థలాలకు పంపించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించడం, ప్రత్యేక శ్రామికరైళ్ళలో అధికారులు వారిని స్వస్థలాలకు పంపిస్తుండడంతో వలస కార్మికుల్లో ఆనందం వెల్లువెత్తింది. జిల్లాలోని రెవెన్యూ అధికారులు, వైద్యశాఖ, పోలీసు అధికారులు దగ్గరుండి వలస కార్మికుల తరలింపునకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేశారు. ఈనెల 6వ తేది రాత్రి నెల్లూరు రైల్వేస్టేషన్ నుంచి మొదటి రైలు బయలుదేరింది. రైలు బోగీల లోపల, బయట పూర్తిస్థాయిలో శానిటైజేషన్ చేశారు. రైలులో కూడా భౌతికదూరం పాటించే విధంగా ఏర్పాట్లు చేశారు. రైలులో ప్రయాణించే కార్మికులకు ఇప్పటికే వైద్య పరీక్షలు నిర్వహించారు. థర్మల్ చెకప్ కూడా చేసి వారిని స్వస్థలాలకు తరలించారు. వలస కార్మికులకు మాస్కులు, శానిటైజర్లతో పాటు వారు స్వస్థలాలకు వెళ్ళేవరకు అన్ని ఏర్పాట్లు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది కూడా.


బతుకుతెరువు కోసం ఈ జిల్లాకు వచ్చి పరిశ్రమల్లోనూ, కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులు లాక్‌డౌన్‌తో పనులు లేక అల్లాడిపోయారు. బీహార్ రాష్ట్రానికి చెందిన 2043 మంది, ఒడిశాకు చెందిన 1277 మంది, తమిళనాడుకు చెందిన 53 మంది వలస కార్మికులు ఉండగా తొలిరోజు ప్రత్యేక శ్రామిక రైలులో 1200 మందిని వారి స్వస్థలాలకు తరలించారు. మిగిలిన వారిని కూడా తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

### బస్సుల్లో యాత్రికుల తరలింపు

వీరు కాక తెలంగాణ రాష్ట్రానికి చెందిన 250 మంది భక్తులు జిల్లాలోని ఏఎస్‌పేట దర్గాకు లాక్‌డౌన్ ముందు వచ్చారు. ఆ తర్వాత లాక్‌డౌన్ ప్రకటనతో ఇక్కడే ఉండిపోయారు. రాష్ట్రప్రభుత్వం చొరవతో ఆ యాత్రికులందరిని కూడా ఈనెల 6న 10 ప్రత్యేక బస్సుల్లో స్వస్థలాలకు పంపారు.

## 100వ పుట్టినరోజు కానుకగా

# కాన్సర్ ఆసుపత్రికి 5 లక్షలు



### జన్మభూమిపై మమకారం చాటుకున్న విఆర్ కాలేజీ విశ్రాంత అధ్యాపకుడు టి.వి.కృష్ణారెడ్డి

అయన పేరు తలమంచి వెంకటకృష్ణారెడ్డి, ఆయన వయస్సు వందేళ్లు, వి.ఆర్ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్‌గా అయన పదవీ విరమణ పొంది 46సంవత్సరాలు. భారతదేశం వదిలి పెట్టి అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో తన కుమార్తె వద్దకు వెళ్ళి స్థిరపడి దాదాపు 4 దశాబ్దాలు.. తెల్లని ధోవతి లాల్చీ లాంటి చొక్కాతో తెలుగుదనానికి నిలువెత్తు నిదర్శనంగా కనపడే అయన టి.వి.కృష్ణారెడ్డిగా వి.ఆర్ కాలేజీలో చదువుకున్న పాతతరం విద్యార్థులకు, అయనతో కలసి పనిచేసిన సహోద్యోగులకు సుపరిచితుడు.

మొన్న మే 4వ తేదీన ఆయనకు వందేళ్లు నిండాయి. ఈ సందర్భంగా జన్మభూమిపై తనకున్న మమకారాన్ని చూపించాడు. నెల్లూరు నగరంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పనిచేసే కాన్సర్ ఆసుపత్రికి 5లక్షల విరాళాన్ని పంపించి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. నెల్లూరుని వదిలేసి ఇన్నేళ్ళైనా సొంతూరుపై అయన ప్రేమ తగ్గలేదు. నూరవ పుట్టినరోజు పండుగ జరుపుకున్న కృష్ణారెడ్డికి 'లాయర్' అభినందనలు.

## గణపం ఓబులరెడ్డి వర్ధంతి సందర్భంగా

# పేద బ్రాహ్మణులకు ఒక నెల రేషన్



నెల్లూరు జిల్లా వింజమూరు వాసి గణపం ఓబులరెడ్డి గారి ద్వితీయ వర్ధంతి సందర్భంగా వింజమూరు పట్టణంలోని 28పేద బ్రాహ్మణ కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యంతో పాటు ఒక నెలకి సరిపడా నిత్యావసరాలను వింజమూరులోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో మే 5వతేదీ మంగళవారం నాడు ఉదయం ఓబులరెడ్డి కుటుంబసభ్యులు అందచేశారు.

కరోనా కష్టకాలంలో ఎలాంటి కార్యక్రమాలు లేక నిస్సహాయస్థితిలో ఆకలితో జీవిస్తున్న పూజారుల కుటుంబాలకు బాసటగా ఓబులరెడ్డి అన్న కుమారుడు గణపం బాలక్రిష్ణారెడ్డి సారథ్యంలో ఓబులరెడ్డి మనుమడు తుంగా శివప్రజీత్‌రెడ్డి, శ్రీమతి సింధూరరెడ్డిలు ఇవి అందజేశారు.

పేద బ్రాహ్మణులకు అండగా తమ చెల్లెలు కుటుంబ సభ్యులు మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని, 25కిలోల బియ్యంతో పాటు ఒక్కొక్క కిలో చొప్పున మినపప్పు, కందిపప్పు, పెసరపప్పు, తినే సెనగపప్పు, వేరుశనగ పప్పుతో పాటు కిలో నూనె, రెండుకిలోలు ఎర్రగడ్డలు, అరకిలో చొప్పున చింతపండు, ఎండు మిరపకాయలే కాకుండా పసుపుతో పాటు 100 గ్రాముల నెయ్యిని కూడా అందజేయడంతో బ్రాహ్మణ కుటుంబాల ఆనందానికి అవధుల్లేవని, వింజమూరు పట్టణవాసులు కూడా ఇలాంటి సేవాభావంతో ముందుకు వచ్చి పేద అర్చకులను ఆదుకోవాలని బాలకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబులరెడ్డి సతీమణి పద్మావతమ్మ, కుమార్తెలు స్వరూప, భారతి, అల్లుళ్ళు శంకరరెడ్డి, శివప్రభాత్‌రెడ్డి, కోడలు సుజాతమ్మ, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి ఇతర మండల నాయకులు పాల్గొన్నారు.

# ఏపి మద్యం పాలసీ పెద్ద స్కాం!

## - సోమిరెడ్డి ఆరోపణ



ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మద్యం పాలసీ పెద్ద స్కాంగా తయారయ్యిందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డాడు. ఈనెల 5వతేదీన మీడియాతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ ఆఫీసు నుండి బయటకు రాకుండా తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయన్నాడు. ప్రస్తుత కరోనా వైరస్ భయంకర పరిస్థితుల్లో మద్యం అమ్మకాలకు తెరలేపడమంటే వైరస్‌ను వెతికి తెచ్చుకోవడమేనన్నాడు. కరోనా కట్టడికి భౌతిక దూరమే ప్రధాన ఆయుధమని ప్రపంచం మొత్తం చెబుతుంటే జగన్ ప్రభుత్వం మాత్రం మద్యంషాపులను తెరచి ఆ నిబంధనలకు తూట్లు పొడిచిందని విమర్శించాడు. వైన్‌షాపులు తెరచిన తొలిరోజే ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే మద్యం కారణంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నాడు. 14 డిస్టిలరీలలో మద్యం ఉత్పత్తికి అనుమతించిన ప్రభుత్వం, మద్యంపై రెండు దఫాలుగా 75 శాతం ధరలు పెంచి నిలువు దోపిడీకి శ్రీకారం చుట్టిందన్నారు. డిస్టిలరీలో చీప్‌లిక్కర్ ఉత్పత్తి చేస్తున్నారని, నాణ్యమైన మద్యం బ్రాండ్లు కనుమరుగయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. చెత్త మద్యం బ్రాండ్లను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన మండిపడ్డాడు.

# తక్కువ వడ్డీకే.. రైతులకు నాబార్డు రుణాలు

## - జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ ఆనం విజయ



కరోనా మహమ్మారి నేపథ్యంలో రైతన్నల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు తక్కువ వడ్డీకే స్వల్పకాలిక రుణాలు అందజేస్తామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ ఆనం విజయకుమార్ రెడ్డి చెప్పారు.


నెల్లూరు నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సమావేశ మందిరంలో ఈనెల 5న జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకి రైతులకు ప్రత్యేక రుణ సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా 100 కోట్ల రూపాయలను జిల్లాకు కేటాయించడం జరిగిందని ఆయన వివరించారు. దీంతో పంట రుణాలతో పాటు పాడిపశువుల పోషణకు, కోళ్ళు, చేపల పెంపకాలకు రుణాలు ఇస్తామన్నారు. పంట రుణాలకు 3 లక్షల రూపాయల వరకు 7శాతం వడ్డీ ఉంటుందన్నారు. ఆ రుణాన్ని ఒక ఏడాదిలోపు చెల్లించినవారికి లక్ష రూపాయల వరకు వడ్డీ లేని రుణం, మిగతా మొత్తానికి పావలా వడ్డీని వర్తింపజేస్తామన్నారు. పాడి పశువులు, కోళ్ళు, చేపల పెంపకానికి బంగారు ఆభరణాలపై 7 శాతం వడ్డీతో 2 లక్షల రూపాయల వరకు రుణం పొందవచ్చని, దానిని ఏడాది లోపు చెల్లించిన వారికి వడ్డీ 33 పైసల వంతున మాత్రమే లెక్కిస్తారని, జిల్లాలోని రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 'ప్రభా'తం

# ప్రపంచం మారేనా?

ఇప్పటివరకు రెండు ప్రపంచ యుద్ధాలను చూశాము, ఆ రెండు యుద్ధాలు కూడా పలు దేశాల మధ్య జరిగినవే! ఈ యుద్ధాలలో బాంబులు, తుపాకులే ఆయుధాలు, వాటితోనే కోట్లాదిమంది మరణించారు. అయితే ప్రపంచానికి అసలు ప్రమాదం బాంబులూ, తుపాకులతో కాదని, కంటికి కనిపించని సూక్ష్మజీవితో పొంచి వుందని నేటి కరోనా వైరస్ నిరూపించింది.

ప్రపంచంలో వున్న అన్ని దేశాలు కూడా కరోనా వైరస్ బారినపడ్డాయి. అన్ని దేశాలు ఆర్థికంగానే కాదు, మనుషుల ప్రాణాల రూపంలోనూ నష్టపోయాయి. ఒకరకంగా చెప్పాలంటే ఇది మూడో ప్రపంచ యుద్ధమే! మొదటి రెండు ప్రపంచ యుద్ధాల్లో ఆయా దేశాలు కూటములుగా ఏర్పడి యుద్ధాలు చేసుకుంటే, ఈ మూడో ప్రపంచ యుద్ధంలో మాత్రం ప్రపంచ దేశాలన్నీ కూడా ఒక కూటమిగా ఏర్పడి కరోనా వైరస్‌తో పోరాడుతున్నాయి. ఈరోజు కాకుంటే రేపైనా కరోనా వైరస్‌కు విరుగుడుగా వ్యాక్సిన్‌లొస్తాయి. మందులొస్తాయి, ఈ వైరస్‌పై ఖచ్చితంగా మనిషి మేధస్సు విజయం సాధిస్తుంది. కాకపోతే కరోనా వైరస్‌తో ఆగిపోతుందా? గతంలో ఎన్నో రకాల వైరస్‌లు పుట్టుకొచ్చాయి. ఈరోజు కరోనా... రేపు ఇంకెన్ని వైరస్‌లు పుట్టుకొస్తాయో? అవెంత ప్రమాదకరంగా వుంటాయో?



వైరస్‌లు ఈ భూమికి కొత్త కాదు, ఇకముందు రాకుండా వుండవనే గ్యారంటీ లేదు. కాబట్టి ఎలాంటి వైరస్‌నైనా ఎదుర్కొనే దిశగా మానవ సమాజం సన్నద్ధం కావాలి. ప్రపంచంలో భవిష్యత్‌లో ఆయా దేశాల మధ్య బాంబులతో యుద్ధాలు వుండవని, బయోవార్‌లు మాత్రమే వుంటాయని నిపుణులు హెచ్చరించారు. ఇప్పుడు ప్రపంచాన్ని పట్టి కుదిపేస్తున్న కరోనా వైరస్ కూడా బయోవార్‌లో భాగమేననే అనుమానాలు కూడా లేకపోలేదు.
ఈ కరోనా వైరస్ ప్రపంచ దేశాలకు ఎన్నో గుణపాఠాలు నేర్పింది. ఇప్పటివరకు సాగిస్తున్న ప్రయాణం కరెక్ట్ కాదని చెప్పింది. అణ్వాయుధాలకంటే ఆసుపత్రులు ముఖ్యమని చాటింది. ఆర్థిక అగ్రాసనం కంటే ఆరోగ్యం ప్రధానమని తేల్చిచెప్పింది.

ఇలా వైరస్‌లు పుట్టుకొచ్చినప్పుడల్లా ప్రపంచం ఆగిపోవాలా? ప్రజాజీవనం స్థంభించి పోవాలా? లాక్‌డౌన్‌తో ప్రజలు రెండు, మూడు నెలల పాటు ఇళ్లకే పరిమితం కావాలా?

వైరస్‌లు ఈ భూమికి కొత్త కాదు, ఇకముందు రాకుండా వుండవనే గ్యారంటీ లేదు. కాబట్టి ఎలాంటి వైరస్‌నైనా ఎదుర్కొనే దిశగా మానవ సమాజం సన్నద్ధం కావాలి. ప్రపంచంలో భవిష్యత్‌లో ఆయా దేశాల మధ్య బాంబులతో యుద్ధాలు వుండవని, బయోవార్‌లు మాత్రమే వుంటాయని నిపుణులు హెచ్చరించారు. ఇప్పుడు ప్రపంచాన్ని పట్టి కుదిపేస్తున్న కరోనా వైరస్ కూడా బయోవార్‌లో భాగమేననే అనుమానాలు కూడా లేకపోలేదు.

ఈ కరోనా వైరస్ ప్రపంచ దేశాలకు ఎన్నో గుణపాఠాలు నేర్పింది. ఇప్పటివరకు సాగిస్తున్న ప్రయాణం కరెక్ట్ కాదని చెప్పింది. అణ్వాయుధాలకంటే ఆసుపత్రులు ముఖ్యమని చాటింది. ఆర్థిక అగ్రాసనం కంటే ఆరోగ్యం ప్రధానమని తేల్చిచెప్పింది. లక్షల కోట్లు యుద్ధ సామాగ్రిని కొనడానికి ఖర్చు చేయడానికి బదులు, ఆ నిధులతో వైద్య, ఆరోగ్య, మౌళిక సదుపాయాలు పెంపొందించుకునేలా వాడుకోమని సూచించింది.

వాస్తవంగా చూస్తే ప్రపంచంలో చాలా దేశాలు తమ శక్తికి మించి రక్షణ కొనుగోళ్ళకు ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇందులో భారతదేశం కూడా వుంది. కేవలం పాకిస్థాన్ అనే గుంటనక్క వల్ల భారత్ రక్షణ వ్యయం ఎప్పటికప్పుడు పెరిగిపోతోంది. ప్రపంచంలో ఇలాంటి దేశాలు చాలానే వున్నాయి. అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ వంటివి ఈ చిన్న దేశాలలో యుద్ధోన్మాదాన్ని రేకెత్తిస్తూ తమ ఉత్పత్తులను ఆ దేశాలకు అంటగడుతున్నాయి.

ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ తెలుసుకోవాల్సింది ఒక్కటే! ఏ ఒక్క సబ్ మెరైన్‌గాని, అణు బాంబుగాని, యుద్ధ విమానం గాని, రాకెట్ లాంచర్ గాని కరోనా వైరస్‌ను నిర్మూలించలేవని, కేవలం వ్యాక్సిన్‌లు, ఔషధాలే వైరస్‌ను నిర్మూలించగలవు, నియంత్రించగలవని. కాబట్టి ప్రపంచ దేశాలన్నీ కూడా అణ్వాయుధాలు, యుద్ధ సామాగ్రికి ఇస్తున్న ప్రాధాన్యతను తగ్గించి, వైద్య ఆరోగ్య సంబంధిత అంశాలపై దృష్టిపెడితే భవిష్యత్‌లో తలెత్తబోయే వైరస్‌లను కూడా విజయవంతంగా ఎదుర్కోవడానికి ఆస్కారముంటుంది.

ప్రపంచం ఇప్పుడన్నా మారాలి! మనం అనవసరమైన చెత్తను చాలా పోగేసుకుంటున్నామనే విషయాన్ని గుర్తించాలి. ఎందుకూ పనికిరాని, మానవ వినాశనానికి దోహదపడే అంశాలకు లక్షల కోట్లు తగలేస్తున్నామనే విషయాన్ని గమనించాలి. భవిష్యత్తులో మనిషి ఇంకా ఎన్నో సవాళ్ళను ఇలాంటి వైరస్‌ల రూపంలో ఎదుర్కోవాల్సి ఉంటుంది. వీటన్నింటినీ సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే మనం పెంపొందించుకోవాల్సింది అణు సామర్ధ్యాన్నో, ఆధునిక ఆయుధ సంపత్తినో కాదు... మేధస్సును! భావిప్రపంచానికి భద్రత కల్పించే వైద్య విజ్ఞానాన్ని!

## ఆశా కార్యకర్తల సేవలు అపూర్వం

**- ఉద్యోగుల సంఘం నేతలు**

కరోనా వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్న ఆశా కార్యకర్తలను ఈనెల 1న ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల సేవలను వారు కొనియాడారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా వ్యాధి నివారణకు వారు చేస్తున్న చర్యలు అపూర్వమని ప్రశంసించారు. అనంతరం వారికి మాస్కులు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకుల ఖాదర్‌బాషా, శశి, సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సునీత, గోపి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు

పొదుపు సంఘాలను ఆదుకునేందుకు సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని డీఆర్‌డీఏ పీడీ శీనానాయక్ అన్నారు. నెల్లూరు బృందావనంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సంఘాలకు సున్నా వడ్డీ నగదును ఈనెల 4న అందజేశారు. చీఫ్ మేనేజర్ మొగిలేశ్వర్ పాల్గొన్నారు. వైయస్సార్ బీమా పరిహారం మంజూరైన వారికి అందించాలని పీడీ శీనానాయక్ పేర్కొన్నారు. నెల్లూరు డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీఎం, మండలస్థాయి సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు.

## పేదలకు అన్నం ప్యాకెట్లు పంపిణీ

కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఈనెల 2న వెంకటగిరిలోని అమ్మవారి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం వారి సహకారంతో, వెంకటగిరి రాజకుటుంబీకుడు సర్వజ్ఞకుమార యాచేంద్ర ఆధ్వర్యంలో పేదలకు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు విజయకుమార్, కరుణాకర్, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కావేరిపాకం రమేష్, శ్రీధర్, గొల్లగుంట మురళి, రాఘవయ్య పాల్గొన్నారు.




## అలాగే కొనసాగించి ఉండాలి!

లాక్‌డౌన్ మూలంగా ఒకటిన్నర నెలపాటు రాష్ట్రంలో ప్రజలకు మద్యం అందుబాటులో లేకుండాపోయింది. కొందరు బ్లాక్‌లో కొనుక్కుని తాగారు, ఇంకొందరు మద్యం దొరక్క మానేసే పరిస్థితిలో వున్నారు. ఇంకో నెలపాటు మద్యంషాపులను తెరవకుండా వున్నట్లయితే రాష్ట్రంలో చాలామంది మద్యం మానేసేవాళ్ళు. అనవసరంగా మద్యం షాపులను తెరిచి, దీనిని మర్చిపోవాలనుకున్నవాళ్ళకు మళ్ళీ గుర్తు చేశారు.

వి.సుధాకర్, ఒజిలి.

## హెడ్‌డౌన్.. వెల్‌డన్

దేశం కన్నా మించింది ఏమీ లేదు. ప్రత్యేక పరిస్థితులలో కొన్ని విలువలు పాటించాలి. ప్రస్తుతం ప్రపంచమే కరోనా వైరస్‌తో పోరాడుతోంది. భారత దేశం యావత్తు లాక్‌డౌన్ ద్వారా కరోనా కట్టడికి కృషి చేస్తోంది. ఇందులో మీడియా ప్రముఖపాత్ర పోషిస్తోంది. ఈ విషయంలో 'లాయర్' మరో అడుగు ముందుకేసి మే 1వ తేదీ సంచికలో 'హెడ్‌డౌన్' చేసి కరోనా వార్తకు ప్రాధాన్యతనివ్వడం అభినందనీయం. తీవ్రమైన అంశానికి 'లాయర్' ఎంతటి ప్రాధాన్యతనిస్తుందనే దానికి ఇది ఉదాహరణ. పత్రికా విలువలకు పెద్దపీట వేస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తున్న 'లాయర్' యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు.

గోపాల్.ఎన్, చెన్నై.

## నెల్లూరు పూర్తి చిత్రాలు అద్భుతం

మే 1వ తేదీ 'లాయర్' సంచికలో 'నిశ్శబ్ద నెల్లూరు' శీర్షికలో ప్రచురితమైన గగనతల చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. ఈ ఫోటోల ద్వారా నెల్లూరు నగరాన్ని పూర్తిగా చూసే అవకాశం దక్కింది. నిర్మానుష్యంగా వున్నా కూడా మా నెల్లూరు ఎంతో సుందరంగా కనిపించింది. ఏ పత్రికలో రాని విధంగా నెల్లూరు నగరంలోని ఆయా ప్రముఖ ప్రాంతాలను డ్రోన్ షాట్స్ ద్వారా దూరప్రాంతాలలో వున్న మాలాంటి వారికి 'ఆన్‌లైన్ ఎడిషన్' ద్వారా తిలకించే అవకాశం కల్పించినందుకు 'లాయర్'కు ధన్యవాదాలు.

ప్రసాద్ వి.ఎస్, హైదరాబాద్.

## మరో తుగ్లక్ నిర్ణయం

రోజుకు 50 కరోనా పాజిటివ్ కేసులు తగ్గకుండా నమోదవుతున్న కాలంలో సీఎం జగన్ మద్యం షాపులు తెరవడం తుగ్లక్ నిర్ణయమే. అదీగాక మద్యం రేట్లను పెంచితే తాగేవారు తగ్గుతారనడం ఇంకా హాస్యాస్పదంగా ఉంది. మద్యానికి బానిసైనవాళ్ళు ఇంట్లో వున్న సామాన్లు, నగలు అమ్మైనా తాగుతారు గాని రేట్లు పెంచారని తాగడం మానేయరు గదా!

– జె.ఎస్.కృష్ణ, నెల్లూరు.

## కరోనా బాధితుల సేవలో...

# ఉరకలెత్తిన నాయక గణం

• విస్తృతంగా సేవా కార్యక్రమాలు

***కరోనా వైరస్... లాక్‌డౌన్... ఆటో ఆగింది, ఆర్టీసీ బస్సు నిలిచింది, చెక్కబండి పక్కన పడింది, బడ్డీ కొట్టుకు గొళ్ళెం పడింది, టీ స్టాల్, టిఫిన్ కొట్టు మూతపడ్డాయి... భవనాల నిర్మాణం ఆగింది, కూలీల బ్రతుకు బండి ఆగింది... లాక్‌డౌన్‌తో అన్నీ ఆగాయి. కానీ ఒక్కటి మాత్రం ఆగలేదు. అదే ఆకలి. పను ల్లేవని, సంపాదనలేదని ఆ ఆకలికి తెలియదు కదా! టైం టు టైం గంట కొట్టినట్టు వేళకు కడుపులో ఎలుకలు తిరుగుతుంటాయి.***

అయితే ఇంతటి సంక్షోభ సమయంలోనూ, లక్షలాది మంది పనులు లేక, చేతిలో సంపాదన లేక ఖాళీగా వుంటున్న రోజుల్లో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, స్వచ్ఛంధ సంస్థలు చూపుతున్న చొరవ అభినందనీయం. మానవత్వానికి మచ్చుతునక. లాక్‌డౌన్ అమలులోకి వచ్చి ఒకటిన్నర నెల దాటింది. ఫలానా చోట తిండి లేక చచ్చిపోయారనో, ఆకలితో వస్తులున్నారనో చెప్పే సంఘటన జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేదు.

నియోజకవర్గాల వారీగా చూస్తే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమ నియోజక వర్గ పరిధిలోని నిరుపేదలను గుర్తించి వారికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, కూరగాయలు వంటివి అందించి ఆదుకున్న తీరు అమోఘం. ఈ విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా కోవూరు నియోజకవర్గంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గంలో కిలివేటి సంజీవయ్య, నెల్లూరు నగరంలో మంత్రి పి.అనిల్‌కుమార్ యాదవ్, వెంకటగిరిలో ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ నియోజకవర్గంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, కావలి నియోజక వర్గంలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కరోనా బాధితులను ఆదుకునే ప్రయత్నాలు బాగానే చేశారు. ఎవరూ పస్తులుండాల్సిన పని లేకుండా చేశారు. అలాగే తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కూడా కరోనా బాధితుల సేవల్లో పాలుపంచుకోవడం విశేషం. ఎన్నికలప్పుడే కాదు, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజల్లో వుంటామని, వాళ్లకు అండగా నిలుస్తామని నాయకగణం చాటిచెప్పడం విశేషం!















# మందుబాబులకు.. పండగొచ్చింది

***దాదాపు 40రోజుల తర్వాత మద్యం షాపులు తెరచుకోవడంతో మందుబాబులకు పండగొచ్చినట్లయ్యింది. ఇన్ని రోజులపాటు మందు కోసం ఉగ్గబట్టినవాళ్ళు 4వ తేదీ నుండి మద్యం దుకాణాలు తెరచుకోవడంతో రేస్ గుర్రాల్లాగా వైన్‌షాపుల వైపుకు పరుగులు తీశారు.***

రెడ్‌జోన్‌లలో మినహాయిస్తే మిగిలిన అన్ని జోన్‌లలో మద్యంషాపులను తెరవడంతో మద్యం ప్రియులు వాటి ముందు భారీగా క్యూలు కట్టారు. పలుచోట్ల వైన్‌షాపుల ముందు 'క్యూ' లైన్ కిలోమీటరు దాటిపోయి వుండడం విశేషం. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 7గంటల దాకా మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. అయితే ఆ టైం చాలడం లేదు. ఉదయం 6 గంటల నుండి వైన్ షాపులు తెరచినా కొద్దిరోజుల పాటు మందుబాబుల దాహం తీరేటట్లు లేదు.

కరోనా సీజన్‌లో లాక్‌డౌన్ సమయంలో దేనికీ లోటు రాలేదు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు సడలింపునిస్తుండడం వల్ల నిత్యావసర సరుకులు దొరుకుతున్నాయ్, చికెన్, మటన్, గుడ్లు, మెడిసిన్స్... మనిషికి అత్యవసరమైన ప్రతి వస్తువు కూడా దొరుకుతూనే వుంది. బియ్యం, కూరగాయలు, పప్పులు, నూనెలు వంటివి అయితే రాజకీయ నాయకులు, స్వచ్ఛంధ సంస్థల వాళ్ళు పోటీలుపడి పంచుతున్నారు. వేళకు ఆహార పొట్లాల పంపిణీ బ్రహ్మాండంగా జరుగుతోంది.

కాని, నిన్నటి వరకు ఒకే ఒక్క వస్తువు దొరక్క దానికి అలవాటుపడ్డ వాళ్ళు పడిన బాధలు అన్నీ ఇన్నీ కావు. లాక్‌డౌన్ సమయంలో అన్నీ దొరుకుతున్నాయి గాని మద్యం మాత్రం దొరక లేదు. మద్యం దొరకక మందుబాబులు పడిన బాధలు వర్ణనాతీతం.

లాక్‌డౌన్ ఇన్ని రోజులు వుంటుందని ముందుగానే వూహించి వుండుంటే కొంతన్నా ముందు జాగ్రత్త పడుండేవాళ్ళు. నెల, రెండు నెలలకు సరిపడా స్టాక్‌ను రెడీ చేసుకుని వుండేవాళ్ళు. ప్రధాని నరేంద్ర మోడీ సడన్‌గా లాక్‌డౌన్ ప్రకటించేయడంతో మందుబాబులు అలర్ట్ కాలేకపోయారు. రాష్ట్రంలో వైన్‌షాపులు ప్రభుత్వ ఆధీనంలో వుండడంతో ఇప్పుడు దొంగతనంగా వైన్‌షాపులను తెరచి మద్యం అందించే పరిస్థితి లేదు. లాక్‌డౌన్ అమలులోకి వచ్చే ముందురోజే అన్ని వైన్‌షాపులు, బార్లలో అధికారులు మద్యం నిల్వలు లెక్కలు చూసి సీల్ చేశారు.

స్థానిక ఎన్నికలు వస్తున్నాయని చెప్పి గ్రామాలలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు ముందస్తుగా మద్యం కొనుగోళ్లు చేశారు. అయితే కరోనా మూలంగా ఎలక్షన్ లేకపోవడంతో, ఎలక్షన్ కోసమని కొన్న మద్యాన్ని ఈ కరోనా కరువుకాలంలో అధిక రేట్లకు అమ్ముకున్నారు. మద్యంకు ప్రస్తుతం ఎంతగా డిమాండ్ వుందంటే వెయ్యి రూపాయల విలువచేసే ఫుల్‌బాటిల్‌ను బ్లాక్‌లో ఐదువేలు పెట్టి కొంటున్నారు. ఇంత రేటు ఇస్తామంటున్నా మద్యం సీసాలు దొరక లేదు. కొన్ని చోట్ల పల్లెల్లో అయితే మద్యం దొరకక నాటుసారా కాసుకోవడం మొదలుపెట్టారు. ఇంకో




నెలలో మద్యం అందుబాటులోకి రాకపోయుంటే మన నెల్లూరుజిల్లా నుండి కూడా ఎర్రగడ్డ ఆసుపత్రికి చాలా కేసులే వెళ్లేవి! అయితే ఇప్పుడు మద్యం షాపులు తీసినందువల్ల ఎర్రగడ్డ కేసులు తగ్గొచ్చేమో గాని, మద్యం షాపుల వద్ద నిబంధనలు అతిక్రమించి గుంపులు గుంపులుగా చేరుతున్న మందుబాబుల వల్ల మాత్రం కరోనా కేసులు పెరిగేటట్లున్నాయి.!




# కార్పొరేషన్‌కు 80 కోట్లు

నెల్లూరు నగరంలో గత కొంతకాలంగా నిలిచిపోయిన రోడ్ల పనులకు మోక్షం లభించనుంది. పెండింగ్‌లో ఉన్న అలాంటి అభివృద్ధి పనులన్నిటినీ కొనసాగించి సత్వరం పూర్తి చేయడానికి నెల్లూరు నగరపాలక సంస్థకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 80 కోట్ల రూపాయల అదనపు నిధులను విడుదల చేసింది. దీంతో నెల్లూరు నగరంలోని షాదీమంజిల్, మూలాపేటలో ఉన్న కోనేరు, పెన్నానది వద్ద ఉన్న రంగనాయకులస్వామి ఘాట్, బోడిగాడితోట స్మశానవాటిక పనులు, కమ్యూనిటీ భవనాలు వగైరాల నిర్మాణాలతో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సిమెంట్‌రోడ్ల పనులు, డ్రైనేజీ కాలువల పనులు పూర్తి చేయనున్నారు. అవసరమైన చోట కల్వర్టులను నిర్మించనున్నారు. మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ సూచనల మేరకు ఈ పనులు చేపట్టనున్నారు.

# భగభగమంటున్న సూరీడు

లాక్‌డౌన్ మూలంగా ప్రజలు పెద్దగా పట్టించుకుంటున్నట్లు లేదుగాని ఎండలు బాగా మండిపోతున్నాయి. మే నెల అంటేనే మండే కాలం. ఎండలు బాగా ముదిరాయి. కాకపోతే లాక్‌డౌన్ మూలంగా ప్రజలు ఎండవేళకు ఇళ్ళలోనే వుంటున్నారు. కాబట్టి ఎండల తీవ్రత తెలియడం లేదు. మే నెలంతా లాక్‌డౌన్ అమలులో వుంటే ఈ వేసవి కాలాన్ని చాలావరకు దాటేసినట్లే!

# తెరచుకున్న రిజిస్ట్రేషన్ ఆఫీసులు

లాక్‌డౌన్ నేపథ్యంలో ఒకటిన్నర నెల నుండి నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సేవలు ఈనెల 5వతేదీ నుండి తిరిగి ప్రారంభమయ్యాయి. జిల్లాలో గ్రీన్, ఆరెంజ్ జోన్‌ల పరిధిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను 5వ తేదీ నుండి తెరిచారు.

### కలెక్టర్‌పై ఎమ్మెల్యేల

# విమర్శలు అనుచితం

కరనా వైరస్‌ను నివారించేందుకు జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అహర్నిశలు కృషిచేస్తూ ప్రజల అభిమానం పొందుతుంటే, కొందరు అధికారపార్టీ ఎమ్మెల్యేలు కలెక్టర్‌ను విమర్శించడం అనుచితమని ఏపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ ఈనెల 6న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి తమ ఎమ్మెల్యేలకు తగు సూచనలు చేయాలని ఆయన కోరారు.

### ఆన్‌లైన్ పోటీల

# తేదీలు పొడిగింపు

లాక్‌డౌన్ కారణంగా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నిర్వహించే వ్యాస రచన, డ్రాయింగ్, ముగ్గుల పోటీల తేదీని పొడిగించినట్లు ఈనెల 4న జిల్లా విద్యాశాఖాధికారి జనార్థనాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల17 వరకు విద్యార్థులు ఇంటి దగ్గరే ఉండి కరోనా వైరస్ నియంత్రణపై వ్యాసరచన, డ్రాయింగ్, ముగ్గులు వేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు.

## నెల్లూరు కబుర్లు

• మూర్తి రిలీవ్

# కమిషనర్‌గా బాపిరెడ్డి



నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాపిరెడ్డి ఈ నెల 5వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన నుడా వైస్‌ఛైర్మెన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కమిషనర్‌గా వున్న పివివిఎస్ మూర్తిని అనంతపురం రీజినల్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. మార్చి 9వ తేదీన మూర్తి బదిలీ ఆర్డర్స్ వచ్చినప్పటికీ, లాక్‌డౌన్ మూలంగా ఆయనను రిలీవ్ చేయలేదు. ఇప్పుడు రెండో విడత లాక్‌డౌన్ కూడా ముగియడంతో ఆయనను రిలీవ్ చేసి బాపిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. సోమవారం మూర్తికి నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

# బ్రాహ్మణులకు నిత్యావసరాలు



నెల్లూరు నవాబుపేట రామకృష్ణానగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈనెల 3న పేద బ్రాహ్మణులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బలిజేపల్లి సత్యదేవ్, యల్లాప్రగడ మాధవరావుల సహకారంతో కరోనా మహమ్మారి వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న 40 మంది పేద బ్రాహ్మణులకు మందిరం మేనేజింగ్ ట్రస్టీ నాగిశెట్టి బాబూరావు, గౌరవాధ్యక్షులు యనమల క్రిష్టయ్య చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం జరిగింది. మేకల రమేష్ బాబు, అర్చక సంఘం అధ్యక్షులు శ్రీధర్ శర్మ, సుధాకర్, పెంచల నరశింహం, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో..



నెల్లూరు జడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు ఎల్‌బీఎస్‌నగర్‌లో నివసిస్తున్న 100 మంది నిరుపేదలకు అయిదు రకాల కూరగాయలను పంపిణీ చేశారు. జడ్పీ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి, ఇంటర్నేషనల్ డిప్యూటి గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు చలంచర్ల భాస్కరరెడ్డి, ప్రచారకార్యదర్శి మండవ శ్రీనివాసరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ విద్యాసంస్థలు..

# ఫీజుల నియంత్రణ పాటించాలి

**- ప్రొ. వి.నారాయణరెడ్డి**



రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 2020-21 ఆర్థిక సంవత్సరానికి ఫీజులపై తప్పనిసరిగా నియంత్రణ పాటించాలని ఏపి స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి ఈనెల 4న ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ కాంతారావు సారధ్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ విద్యాసంస్థలకు సంబంధించి పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నామని, మొదటి టర్మ్‌ఫీజు చెల్లించలేదన్న కారణంతో విద్యార్థుల అడ్మిషన్ నిరాకరించకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# గుండ్లు ఫ్యాషన్ అయ్యాయి

కరోనా వైరస్ దెబ్బకు హెయిర్‌కటింగ్ సెలూన్‌లు ఇప్పుడప్పుడే తెరుచుకునే పరిస్థితి కనిపించడం లేదు. లాక్‌డౌన్ ఎత్తేసినాక కూడా కొన్ని రోజులపాటు వీటిని తెరవకపోవచ్చు. ఎందుకంటే పలు దేశాలలో ఈ సెలూన్‌ల ద్వారా వైరస్ వేగంగా వ్యాప్తి చెందింది. కాబట్టి ఇప్పుడిప్పుడే సెలూన్‌లు తెరచుకోకపోవచ్చు. సెలూన్‌లు తెరచుకొనడం లేదని జుట్టు, గడ్డం పెరగడం ఆగవు కదా! ఈ లాక్‌డౌన్‌తో చాలామంది సెల్ఫ్‌షేవింగ్‌కు అలవాటుపడ్డారు. కొందరు ట్రిమ్మర్ల ద్వారా తమ జుట్టు తామే కట్ చేసుకుంటుండగా, ఇంకొందరు ఏకంగా గుండ్లే చేసేసుకుంటున్నారు. ఎండాకాలం కాబట్టి గుండు గీక్కున్నా హాయిగా వుంటుంది.

# సీఏ పరీక్షలు వాయిదా

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) పరీక్షలు వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం జూన్ 19 నుంచి జూలై 4 వరకు పరీక్షలు జరగాల్సివుంది. అయితే కరోనా తీవ్రత తగ్గక పోవడంతో పరీక్షలను జూలై 29 నుంచి ఆగస్టు 16 వరకు నిర్వహించనున్నారు.

### గ్యాస్ వాహనాల డ్రైవర్లకు

# రవాణాశాఖ కిట్‌లు

నెల్లూరు నగరంలోని పలు గ్యాస్ కంపెనీలకు చెందిన వాహనాల డ్రైవర్లకు ఈనెల 2న రవాణాశాఖ అధికారులు మాస్కులు, శానిటైజర్లు, డెట్టాల్‌సోప్‌ల కిట్‌లను పంపిణీ చేశారు. వేదాయపాళెంలోని శుభా గ్యాస్ ఏజెన్సీ, దర్గామిట్టలోని కృష్ణా ఏజెన్సీ, నవాబుపేటలోని రెడ్డి అండ్ రెడ్డి గ్యాస్ ఏజెన్సీల వాహనాల డ్రైవర్లకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ ఎంవిఐలు మాధవరావు, సునీల్‌రెడ్డి, బాలకృష్ణ, భాస్కరరావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయలకు కొరత లేదు

**- వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్**

జిల్లా ప్రజల అవసరాలకు సరిపడా కూరగాయలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని, వాటికి ఎలాంటి కొరతలేదని నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఎంబేటి ఏసునాయుడు చెప్పారు. నెల్లూరు నగరంలోని ఫత్తేఖాన్‌పేట రైతు బజారును ఆయన ఈనెల 3న పరిశీలించి అక్కడ దుకాణదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సాధారణంగా చెన్నై నుంచి క్యాబేజీ, క్యారెట్ వంటివి వస్తుంటాయని, కరోనా నివారణ చర్యల్లో భాగంగా తమిళనాడు నుంచి వస్తున్న ఆ కూరగాయలను గత మూడురోజులుగా నిలిపేశామని, వాటి రవాణా నిలిపేసినప్పటికీ జిల్లాలో పండించే కూరగాయలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మార్కెట్లలో ఉండేవారితో పాటు, రైతుబజార్లలో పనిచేసేవారికి కూడా కరోనా పరీక్షలు చేయించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

### సిఎం సహాయనిధికి..

# ఎల్‌ఐసి ఏజెంట్ల వితరణ

లైఫ్ ఇన్స్యూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ సౌత్ సెంట్రల్ జోన్ ప్రతినిధులు ఈనెల 1న సిఎం సహాయనిధికి 6 లక్షల రూపాయలు విరాళం ప్రకటించారు. ఆ మేరకు చెక్కును రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్‌కు ఆయన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఫెడరేషన్ సౌత్‌జోన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని ఏజెంట్ల వద్ద నుంచి ఆరు లక్షల రూపాయలు సేకరించి సిఎం సహాయనిధికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, షాహుల్ హమీద్, బాబూరావు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# విస్తుపోతున్న సేవకులు

పాపం అనేక స్వచ్ఛంద సంస్థలవాళ్ళు గత ఒకటిన్నర నెలగా లాక్‌డౌన్‌తో పనులు లేక ఇళ్ళ వద్దే వుంటున్న ఎన్నో పేద కుటుంబాలవారికి నిత్యావసర సరుకులు, కూరగాయలు అందించారు. ఆహార పాకెట్లను పంపిణీ చేశారు. పేదలనే కనికరంతో వీళ్లంతా వారిపట్ల మానవత్వం చూపారు. అయితే మొన్న మద్యం షాపులు తెరవంగానే ఇలా సాయం పొందిన వాళ్ళే ఎక్కువుగా క్యూలలో నిలబడి వుండడాన్ని చూసి స్వచ్ఛంద సంస్థలవాళ్ళు విస్తుపోతున్నారు.

### నెల్లూరు నుండి

# డయాలసిస్ కేంద్రం మార్పు

నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో వున్ననెఫ్రోప్లస్ డయాలసిస్ కేంద్రాన్ని నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మార్పు చేసినట్లు వైయస్సార్ ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ నాగార్జున ఈనెల 4న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా వెంకటాచలం మండలానికి చుట్టుప్రక్కల 20కిలోమీటర్ల దూరంలో వున్న కిడ్నీ రోగులు డయాలసిస్ చేయించుకోవచ్చని తెలిపారు.

# కరోనా కట్టడికి అన్ని శాఖలూ కృషి

**- మంత్రి డాక్టర్ అనిల్**



జిల్లాలో కరోనా వ్యాధిని అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు ఎంతో సమన్వయంతో నిరంతర కృషి చేస్తున్నారని, అందువల్లే మంచి ఫలితాలు వస్తున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి. అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 1న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమావేశమై జిల్లాలో కరోనా నివారణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను సమీక్షించిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ కరోనా బాధితులైన వారిలో 80శాతం మందిని రానున్న రెండు వారాల్లో డిశ్చార్జ్‌చేసే అవకాశం ఉందన్నారు.

## కరోనా పరీక్షల నిర్వహణలో రాష్ట్రం ముందంజ

కరోనా పరీక్షల నిర్వహణలో దేశంలోనే మన రాష్ట్రం ముందంజలో ఉందని మంత్రి డా. అనిల్ ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిరోజూ అధికారులతో సంప్రదిస్తూ తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారని, కరోనా నివారణకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో వలస కూలీలకు సంబంధించి చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేశామని, వారికి ర్యాండమ్‌గా వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. రంజాన్ మాసం నేపథ్యంలో, క్వారంటైన్‌లో ఉన్న 200 మంది ముస్లింలకు ప్రత్యేక భోజన వసతి ఏర్పాటు చేశామని చెప్పారు. ఐసొలేషన్‌లోను, క్వారంటైన్‌లోను ఉన్నవారిని ఇంటికి పంపించేటప్పుడు ప్రతి ఒక్కరికి వైద్యపరీక్షలు నిర్వహించిన తర్వాతనే డిశ్చార్జ్ చేస్తున్నారని తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, వచ్చే నెలలో రైతుభరోసా కార్యక్రమం కూడా నిర్వహిస్తామని మంత్రి డా.అనిల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, నెల్లూరు రూరల్ వైయస్సార్సీపి కార్యాలయం ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌జోన్లలో సడలింపులు ఉండవు

- **లాక్‌డౌన్ నిబంధనలు మరింత కఠినతరం చేయాలి**
- **పోలీసులకు ఐజీ ప్రభాకర్‌రావు ఆదేశాలు**

రెడ్‌జోన్ ప్రాంతాల్లో ఎలాంటి సడలింపులు ఉండని, రాబోయే రోజుల్లో ఆ నిబంధనలు మరింత కఠినంగా ఉంటాయని, నెల్లూరు రెడ్‌జోన్‌లో ఉంది కనుక ఇక్కడ లాక్‌డౌన్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని గుంటూరు రేంజ్ ఐజి జె.ప్రభాకర్‌రావు పోలీసు అధికారులను ఆదేశించారు.

ఈనెల 3న ఆయన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన అధికారుల సమీక్షా సమావేశంలో కరోనా నియంత్రణ గురించి అధికారులు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కరోనా పాజిటివ్ కేసులకు సంబంధించిన ప్రైమరీ కాంటాక్ట్, సెకండరీ కాంటాక్ట్‌ల వివరాలన్నీ సేకరించి ప్రతిఒక్కరికీ కరోనా పరీక్షలు చేయించాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్‌లతో కలిసి నెల్లూరు నగరంలో రెడ్‌జోన్లుగా ఉన్న కోటమిట్ట, ఖుద్దూస్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కరోనా పాజిటివ్‌కేసులు నమోదైన వారి ఇళ్ళ వద్దకు వెళ్ళి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ, కరోనా వైరస్ రోజురోజుకు పెరుగుతోందని, అందరూ అప్రమత్తంగా ఉంటూ సామాజిక దూరం పాటించాలని హెచ్చరించారు.



రెడ్‌జోన్ ప్రాంతాల్లోనే కరోనా వస్తుందనుకుంటే పొరపాటని, ప్రాంతాలతో సంబంధం లేకుండా కరోనా వైరస్ ఏ ప్రాంతంలోని వారికైనా సోకుతుందని అందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. మరీ అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ ఇళ్లలోంచి బయటకు రావద్దని, లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సామాజిక దూరం తప్పనిసరిగా పాటించాలని, అందరూ మాస్కులు ధరించాలని, స్వీయ నియంత్రణ, ఎప్పటికప్పుడు ముందుజాగ్రత్తలు తీసుకుంటుండడం ద్వారానే కరోనా వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయగలమని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు మాట్లాడుతూ జిల్లాను రెడ్‌జోన్, ఆరెంజ్ జోన్, గ్రీన్‌జోన్లుగా విభజించడం జరిగిందని, ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఏయే జోన్లలో ఎలా వ్యవహరించాలో నిర్ణయించడం జరుగుతోందని అన్నారు. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ కరోనా మహమ్మారిని నివారించేందుకు విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి కూడా కరోనా పరీక్షలు చేయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఏఎస్పీలు పి.వెంకటరత్నం, పి.మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వలస కూలీలను స్వస్థలాలకు పంపేందుకు చర్యలు

**- జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు**

వలస కూలీలను, కార్మికులను స్వస్థలాలకు పంపించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ యం.వి.శేషగిరిబాబు ఆదేశించారు. ఈనెల 3న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ నుంచి 737, పశ్చిమ బెంగాల్ నుంచి 604, ఒడిశా నుంచి 571, బీహార్ నుంచి 830 మంది కార్మికులు, ఇతర జిల్లాలకు చెందిన వలస కూలీలు, జిల్లాలో వేల సంఖ్యలో వున్నారని వీరిని స్వస్థలాలకు పంపించేటప్పుడు అవసరమైన వైద్య పరీక్షలను ర్యాండమ్‌గా నిర్వహించాలన్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులను పంపేందుకు రైల్వే అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇతర జిల్లాల కూలీలను బస్సుల్లో పంపించాలన్నారు. ఇప్పటి వరకు పేర్లు రిజిష్టర్ చేయించుకున్న వారి వివరాలను సేకరించాలని, వారు ఏయే కారణాలతో ఇక్కడికి వచ్చారో తెలుసుకోవాలన్నారు. చదువు కోసం వచ్చిన విద్యార్థులు, ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన విద్యార్థుల అవసరాలను గుర్తించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించారా, వారికి సరైన భోజన వసతి కల్పించారా అనే విషయాలను సేకరించాలన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించని పరిశ్రమలు, సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి జిల్లాకు మూడు నుంచి నాలుగువేల మంది వచ్చే అవకాశం ఉందని, వీరికి డివిజన్లు, మండలస్థాయిలో పరీక్షలు నిర్వహించాలన్నారు. థర్మల్ స్క్రీనింగ్‌కు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. జేసీ వినోద్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కల్పనా కుమారి, డీఆర్ఓ మల్లిఖార్జున, డీఆర్డీఏ పీడీ శీనానాయక్, ప్రమోద్ కుమార్, తిరుమలయ్య పాల్గొన్నారు.



# పరిశ్రమల పున:ప్రారంభం సంతోషకరం

**- ముఖ్యమంత్రి జగన్‌కు శ్రీసిటీ ఎం.డి ధన్యవాదాలు**

రాష్ట్రంలో కంటైన్మెంట్ జోన్లను మినహాయించి ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలు తిరిగి ప్రారంభించేందుకు అనుమతిస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషకరమని శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని కొంతవరకు తగ్గించడానికి ఇది సరైన సమయానుకూల చర్య అని పరిశ్రమల సిఇఓలు అభిప్రాయపడ్డారు. శ్రీసిటీలోని పరిశ్రమల తరఫున శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతూ, జీవితం మరియు జీవనోపాధి మధ్య సమతుల్యతను సాధించేందుకు కంటైన్మెంట్ జోన్ల వెలుపల పరిశ్రమలు పనిచేసేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇస్తూ తీసుకున్న నిర్ణయం ఎంతో హర్షదాయకమన్నారు. అందుకుగాను ముఖ్యమంత్రికి, రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డికి తన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి స్పందిస్తూ ఈనెల4న శ్రీసిటీలోని సుమారు 100 పరిశ్రమలు నిర్దేశించిన ప్రామాణిక విధి విధానాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా ఉత్పత్తుల పున:ప్రారంభానికి సిద్ధపడ్డాయి. కంటైన్మెంట్ క్లస్టర్ల వెలుపల నివసించే సిబ్బందిని మాత్రమే పరిశ్రమల్లోకి అనుమతిస్తున్నాయి.

## సిఎం నిర్ణయంతో పరిశ్రమలకు చేయూత

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు(ఎంఎస్ఎంఇ) పారిశ్రామిక ప్రోత్సాహ నిధుల బకాయిల విడుదలతో పాటు మూడునెలల కనీస విద్యుత్ చార్జీలను మాఫీ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఆయా పరిశ్రమలకు ఎంతో చేయూతనిస్తుందని శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం ప్రశంసించింది. ఇందుకు కృషిచేసిన రాష్ట్రముఖ్యమంత్రికి, పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిలకు శ్రీసిటీలోని పరిశ్రమల తరఫున శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందులకు గురైన శ్రీసిటీలోని ఎంఎస్ఎంఇ యూనిట్లకు కూడా ఈ నిర్ణయం మేలు చేకూరుస్తుందన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల



- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్
- రామ్‌కుమార్‌రెడ్డి ధన్యవాదాలు

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఎంత ఖర్చునైనా భరిస్తామని పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విద్యాదీవెన పథకాన్ని ప్రవేశపెట్టి 2019-20 సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తి బకాయిలు సుమారు 4వేల కోట్ల రూపాయలను విడుదల చేయడం హర్షదాయకమని ఏపి ప్రైవేట్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపెక్మా) ప్రెసిడెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తన హర్షం వ్యక్తం చేశారు. అంతేకాక, ప్రస్తుత కరోనా విపత్కర పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో రావాల్సిన పాతబకాయిలు కూడా సుమారు 1880కోట్ల రూపాయలను కూడా కళాశాలలకు చెల్లించినందుకు ఆయన తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే జగనన్న వసతి దీవెన ద్వారా విద్యార్థులకు సుమారు 1100కోట్ల రూపాయలను వారి తల్లుల ఖాతాల్లో తొలివిడతగా జమచేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థి తల్లి బ్యాంక్ అకౌంట్‌లో జమచేయడం సమంచితంగా ఉంటుందని, తద్వారా విద్యార్థుల తల్లులు కళాశాలలకు వచ్చి తమ బిడ్డల చదువుల విషయంతో పాటు ఆయా కళాశాలల్లోని వసతులను స్వయంగా పరిశీలించే అవకాశం కల్పించడం వల్ల ఆ కళాశాలలు కూడా బాధ్యతా యుతంగా ఉంటాయని ఆయన సూచించారు.

# పేర్నాటి శ్యామ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైయస్సార్‌సిపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈనెల 3న నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు పార్టీ నాయకులు కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువ, గజమాలతో ఆయనను సత్కరించారు. మూలి కిషోర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మహేంద్ర, ప్రశాంత్, రాజా, రమేష్ పాల్గొన్నారు.

# గూడూరును రెడ్‌జోన్ నుంచి తొలగించాలి

- మాజీ చైర్‌పర్సన్ కోడూరు కల్పలత వినతి



గూడూరు పట్టణంలో గత 20 రోజుల క్రితం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి మాత్రమే నమోదైందని, ఆ తర్వాత నుంచి ఏవిధమైన కేసులు నమోదు కాలేదని, అయినప్పటికీ గూడూరు పట్టణాన్ని రెడ్‌జోన్ కింద ప్రకటించినందున లాక్‌డౌన్ నుండి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపులకు అర్హత పొందలేక పోతోందని గూడూరు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కోడూరు కల్పలత ఒక లేఖలో ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావుకు తెలియజేశారు. ఏవిధమైన కంటైన్మెంట్ లేకుండానే గూడూరు పట్టణాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించడం ఆశ్చర్యకరమని ఆమె పేర్కొన్నారు. గూడూరులో గత 40 రోజులుగా బడుగు బలహీన, పేదవర్గాల వారు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనేవారు జీవనోపాధి కోల్పోయి గడ్డు పరిస్థితుల్లో ఉన్నారని, ఈ పరిస్థితు లన్నిటినీ పరిశీలించి గూడూరు పట్టణాన్ని రెడ్‌జోన్ నుంచి మినహాయించాలని ఆమె కోరారు. ఆ లేఖ ప్రతులను రాష్ట్ర మంత్రులు డా.పి.అనిల్‌కుమార్ యాదవ్‌కు, గౌతమ్‌రెడ్డికి, జిల్లా కలెక్టర్‌కు, గూడూరు సబ్‌కలెక్టర్‌కు కూడా పంపుతున్నట్లు తెలిపారు.



ఈ నెల 5న గూడూరు పూలతోట గిరిజన కాలనీలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, కమిషనర్ ఓబులేసు, డా.సి.రోహిణి, దీప్తిరెడ్డి

# గూడూరు డివిజన్ వార్తలు

## నెల్‌క్యాస్ట్ ఆధ్వర్యంలో

# పేదలకు నిత్యావసర సరుకులు



గూడూరులోని నెల్‌క్యాస్ట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వారి దాతృత్వంతో సమీపంలోని చవటపాళెంలో ఉన్న 500 పేద కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి నేతృత్వంలో నెల్‌క్యాస్ట్ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎన్.సుదర్శన్‌రెడ్డి, జిఎం (ఫైనాన్స్) డి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేనేజర్ (పిఆర్) ఆనిమెళ్ళ శివకుమార్‌లు పాల్గొని ప్రతి ఇంటికీ సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాక్‌డౌన్‌తో ఉపాధి లేక చాలా మంది ఇళ్ళకే పరిమితమై ఇబ్బందులు పడుతున్నారని, ఆ గ్రామ వాలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి నిత్యావసర సరుకులు అందేలా చేశామని పేర్కొన్నారు.

## 250 కుటుంబాలకు

# రామిరెడ్డి క్లబ్ సాయం



గూడూరు మునిసిపాలిటీ వరిధిలోని చవటపాళెంలో రామిరెడ్డి క్లబ్ వారి దాతృత్వంతో వైయస్సార్‌సిపి మండల కన్వీనర్, సీనియర్ క్లబ్ సెక్రటరీ మల్లు విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 250 కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి ప్రసాద్‌రావు చేతుల మీదుగా ఈ వితరణ జరిగింది. మునిసిపల్ కమిషనర్ ఓబులేసుతో పాటు వైయస్సార్‌సిపి నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కొండారెడ్డి, వేడిచెర్ల శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, రూరల్ ఎస్ఐ పుల్లారావు, పెల్లేటి రామిరెడ్డి పాల్గొన్నారు.

## ముఠా వర్కర్ల కుటుంబాలకు..

# ప్రగతి సేవా సంస్థ సేవలు



గూడూరులోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా ఈనెల 1న 105 మంది ముఠా వర్కర్ల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా వారానికి సరిపడా కూరగాయలు పంపిణీ చేశారు. ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రహ్మణ్యం, ప్రజేంద్రరెడ్డి, గ్రానైట్ ప్రభాకర్, కరిముల్లా, ఉదయశేఖర్‌రెడ్డి, ఆలీ, ముఠా వర్కర్స్ సంఘం అధ్యక్షుడు గారా బాబు, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసులు, చిల్లకూరు రవి, సివిఆర్ న్యూస్ సతీష్, టెన్ టీవీ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో..

# పేదలకు బియ్యం, కూరగాయలు



గూడూరులోని డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో, పలువురు దాతల సహాయంతో గూడూరు రావిచెరువుకట్ట మీద ఉన్న 50 కుటుంబాలవారికి ఇటీవల 5 రకాల కూరగాయలు, ఊరగాయలు, బియ్యం, బిస్కెట్లు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి, శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, అంతర్జాతీయ మానవహక్కులు, నేరవ్యతిరేక సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి మయూరి శ్యామ్‌యాదవ్‌ల చేతుల మీదుగా పేదలకు ఈ సాయం అందజేశారు.

# చేగువేరా ఫౌండేషన్ రక్తదానం



కరోనా కారణంగా గూడూరులోని ప్రభుత్వాసుపత్రిలో రక్తం నిల్వలు తగ్గాయని, ఈ కష్టకాలంలో రోగులకు అవసరమైన రక్తం సమకూర్చడం కోసం మే 2వతేది నుండి 20వ తేది వరకు ప్రతిరోజూ కనీసం 500 మందికి తగ్గకుండా రక్తదానం చేయాలన్న సంకల్పంతో కృషిచేస్తున్నామని గూడూరులోని చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వైయస్సార్ కాంగ్రెస్ యువనేత మండ్ల సురేష్‌బాబు చెప్పారు. గూడూరు ఏరియా ఆసుపత్రి రక్తనిధి కేంద్రంలో తాము రక్తదానం చేస్తున్నామన్నారు. గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, పట్టణ సిఐ దశరథరామారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమ తదితరుల సమక్షంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. తనతో సహా, ప్రజల ప్రాణరక్షణ కోసం చేగువేరా ఫౌండేషన్ సభ్యులు ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తున్నామని సురేష్‌బాబు తెలిపారు. రక్తనిధి ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు గుండాల ఆదినారాయణ, సభ్యులు అన్వర్‌బాషా, క్రాంతి కుమార్, మధురెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద స్కూల్ వితరణ



గూడూరులోని శ్రీ వివేకానంద స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఈనెల 3న గూడూరు 28వ వార్డులోని సుమారు 4 వందల మంది నిరుపేదలకు మధ్యాహ్న భోజనం తయారుచేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు చంద్రమోహన్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నెల్లటూరు గ్రామ సమీపంలోని జనార్ధన కాలనిలో నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను పంచిపెడుతున్న ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఎల్ఎమ్ పనబాక యతిరాజులు, ఆయన సతీమణి వనజమ్మ

# వెంకటగిరి ప్రజలకు అండగా ఆనం



కరోనా కష్టకాలంలో నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అండగా నిలిచారు. ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైయస్సార్ సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కరోనా ప్రబలకుండా జాగ్రత్తలు చెప్పారు.

వెంకటగిరికి సమీపంలోని శ్రీకాళహస్తి మండలంలో ఎక్కువ కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో అక్కడినుంచి వెంకటగిరికి వచ్చే రోడ్డు మార్గాలను పూర్తిగా మూసివేయించారు. నియోజకవర్గంలో ఆయన తన సొంత నిధులతో అన్ని మండలాల్లోని రెవెన్యూ, పంచాయితీరాజ్, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య విభాగం కార్మికులకు శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు పంపిణీ చేశారు. అన్ని మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 50 టన్నుల కూరగాయలు పంపిణీ చేయించారు. ఆనం సూచనలతో పట్టణంలో రాజా కుటుంబీకులు సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర, మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద దంపతులు, కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, డక్కిలిలో వెలికంటి రమణారెడ్డి, బాలాయపల్లి మండలంలో శింగంశెట్టి భాస్కర్‌రావు, గూడూరు భాస్కర్‌రెడ్డి, సైదాపురంలో నోటి రమణారెడ్డి, కృష్ణారెడ్డి, రాపూరులో సెంట్రల్‌బ్యాంక్ డైరెక్టర్ చెన్ను బాలకృష్ణారెడ్డి, కలువాయి మండలంలో మాజీజడ్పీటీసీ బీ.అనిల్‌కుమార్‌రెడ్డి పేదలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేసి బాధితులకు ఆనం తరఫున అండగా నిలిచారు.

# సంపూర్ణ మద్యపాన నిషేధం ఇదేనా?

## ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తిరుమల నాయుడు



సంపూర్ణ మద్యపాన నిషేధం అని చెప్పి... కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న తరుణంలో మద్యం అమ్మకాలను చేపట్టడం సిగ్గుచేటని టిఎన్ ఎస్ఎఫ్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకర్ల తిరుమలనాయుడు ప్రభుత్వంపై మండిపడ్డాడు. నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో తిరుమలనాయుడు ఇటీవల మీడియాతో మాట్లాడుతూ నిత్యావసర సరుకుల కొనుగోళ్లకు కేవలం 3గంటలే సమయమిచ్చిన ప్రభుత్వం... మద్యం అమ్మకాలకు మాత్రం ఉదయం 11 నుండి రాత్రి 7 గంటల వరకూ అనుమతినిచ్చిందని, ధనార్జనే ధ్యేయంగా మద్యం ధరలను కూడా 75శాతం పెంచడం దారుణమని, కరోనా వైరస్ నిర్మూలన చర్యలు కొనసాగుతున్న తరుణంలో మద్యం విక్రయాలు సరికాదని హితవు పలికాడు. తెలంగాణా, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో మద్యం విక్రయాలు జరగడం లేదని గుర్తు చేస్తూ తక్షణం మద్యం విక్రయాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

# నిరుపేదలను ఆదుకోవాలి

లాక్‌డౌన్ నేపథ్యంలో జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆహారం లభించక ఇబ్బందులు పడుతున్న నిరుపేద ప్రజలను ఆదుకోవాలని ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు సుధాకర్ పిలుపునిచ్చాడు. లాక్‌డౌన్ ముగిసేవరకు తమ సంఘం తరపున రోడ్ల మీద అన్నం కోసం అలమటిస్తున్నవారికి, వృద్ధాశ్రమాల్లో ఉన్నవారికి ఆహారం, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తామని ఆయన చెప్పాడు.

# టెన్త్ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు

**- సాంఘిక సంక్షేమశాఖ డి.డి జీవపుత్రకుమార్**

కరోనా నేపథ్యంలో పదవ తరగతి పరీక్షలు వాయిదా పడుతున్న కారణంగా ఇళ్ళకే పరిమితమైన విద్యార్థులు విద్యాశాఖ నిర్వహిస్తున్న ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ జీవపుత్రకుమార్ ఈనెల 3న ఒక ప్రకటనలో సూచించారు. హాస్టల్ విద్యార్థుల కోసం 90 రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. హాస్టల్ విద్యార్థులకు కూడా విద్యాశాఖ ద్వారా 'టేక్ హోం రేషన్' తరహాలో నిత్యావసరాలను అందిస్తామని తెలిపారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

గల్పిక

# ఏపికి రావాలని చంద్రబాబుకు జగన్ ఆహ్వానం

తాడేపల్లిలోని స్పీడ్‌స్టార్, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నివాసం. తన ఛాంబర్‌లో ఆయన ఎక్సైజ్ మంత్రి నారాయణస్వామితో పాటు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్ని నాని, బాలినేని శ్రీనివాసరెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, కొడాలి నాని, మేకపాటి గౌతమ్‌రెడ్డి తదితరులతో సమావేశమై వున్నాడు. ఆయన మంత్రులతో... రేపటి నుండి రాష్ట్రంలో రెడ్‌జోన్ లేనిచోట మద్యం అమ్మకాలకు అనుమతులిస్తున్నాం, అంతేకాదు, 25శాతం రేట్లు కూడా పెంచుతున్నామని చెప్పాడు. ఎక్సైజ్ మంత్రి నారాయణస్వామి అందుకు.. సార్, మనం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే ఒకసారి ధరలు పెంచాం, మళ్ళీ ఇప్పుడు పెంచితే బాగుండదేమో అని అన్నాడు. అందుకు జగన్... మీకు తెలియదులే స్వామీ... మనం ఇంకా 25శాతమే పెంచుతున్నాం... ఈ లాక్‌డౌన్ టైంలో మద్యం సీసాలు ఎంతెంత రేట్లు పెట్టి కొన్నారో చూశావా... వెయ్యి రూపాయలు చేసే మాన్షన్‌హౌస్ ఫుల్ బాటిల్‌ను 5వేలకు కొన్నారంట... 2వేలు చేసే టీచర్స్ ఛాయిస్ ఫుల్ బాటిల్‌ను 10వేలకు కొన్నారంట... ఆ లెక్కన చూస్తే మనం చాలా చీప్‌రేట్లకు అమ్ముతున్నట్లే... అదీగాక ఒకటిన్నర నెలగా మద్యం లేకపోవడంతో మందుబాబుల వద్ద బాగా డబ్బులు మిగిలిపోయాయి. ఈ ఒకటిన్నర నెలలో జరిగిన నష్టాన్ని ఈ రకంగా నన్నా పూడ్చుకుందాం అని అన్నాడు. మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ వుండి... అన్నా, అర్జున్ హీరోగా నటించిన 'ఒకే ఒక్కడు' సినిమాలో ఒక రోజు సీఎం ఛాన్స్‌లాగా, తనకు వారంరోజులు ఈ రాష్ట్రాన్ని అప్పగిస్తే కరోనా వైరస్ కొమ్ములు విరిచేస్తానని చంద్రబాబునాయుడు సవాల్ విసురుతున్నాడు అని చెప్పాడు. వెంటనే మేకపాటి గౌతంరెడ్డి... ఆయన ముఖం... ఇవి పుష్కరాలు కాదు, షూటింగ్ సెషన్స్ పెట్టి జనాలను చంపడానికి... కరోనా కాలం.. 60 ఏళ్లు పైబడినవాళ్ళు బయటకొస్తే డేంజర్... 14ఏళ్లు ఏపి సీఎంగా వుండి ఆయన పీకిందేమీ లేదు. ఇక వారంరోజుల్లో ఏం చేస్తాడంట అని అన్నాడు. బాలినేని శ్రీనివాసరెడ్డి వుండి... అయినా రాష్ట్రానికి రమ్మని ఆయనను ఎవరు ఆహ్వానిస్తున్నారు... ఆయనను రాష్ట్రానికి రమ్మనడం అంటే దారినపోతున్న సమస్యను స్వాగతం బ్యానర్ కట్టి రాష్ట్రానికి ఆహ్వానించడమే కదా అని వివరించాడు.

అతను వస్తే రాని, పోతే పోనీ మనకెందుకులే అని జగన్ మీటింగ్ ముగించి లేచాడు. అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్లిపోయారు.

జగన్ ఇంట్లోకెళ్లి స్నానం చేసి, డైనింగ్ టేబుల్ వద్దకు వచ్చాడు. రెండు పుల్కాలు తిని, కాలక్షేపం కోసమని టీవీ ఆన్ చేశాడు. జెమిని టీవీలో హీరో నాగార్జున, అనుష్క హీరోహీరోయిన్‌లుగా నటించిన 'ఢమరుకం' సినిమా వస్తోంది. ఆ సినిమాలో కమెడియన్ బ్రహ్మానందుకు ఓ మందుపార్టీకి సంబంధించి ఇన్విటేషన్ వుండదు. ఆ ఫంక్షన్‌కు పోవాలనుకున్న బ్రహ్మానందం తనకు తానే ఇన్విటేషన్ రాసుకుని ఆ ఫంక్షన్‌కు వెళతాడు. ఈ సీన్ చూడగానే జగన్ మదిలో ఏదో ఆలోచన... ఆ ఆలోచన కూడా చంద్రబాబు గురించే... అలా ఆలోచిస్తూనే కళ్ళు మూసుకున్నాడు.

★★★★★

హైదరాబాద్‌లోని హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు నివాసం. హాల్‌లో నారా లోకేష్ తన సెల్ ఫోన్‌లో ఏదో ఒక ఫోటో ట్విట్టర్‌లో పెడుతున్నాడు. అప్పుడే చంద్రబాబు అక్కడకు వచ్చి... ఏం చేస్తున్నావురా అని అడిగాడు. అందుకు లోకేష్... టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి ఈరోజు తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకున్నాడు. ఈ లాక్‌డౌన్ సమయంలో ఆయన కోసం గుడి తలుపులు తెరుచుకోవడమేంటి...? అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ట్విట్టర్‌లో ఫోటో పెట్టి ట్వీట్ చేస్తున్నా అని చెప్పాడు. దానికి చంద్రబాబు... రేయ్, అతను టిటిడి ఛైర్మెన్... నిత్య పూజల్లో ఆయన పాల్గొనవచ్చు. అదేం తప్పు కాదులే అని అన్నాడు. దానికి లోకేష్... ఆ విషయం వై.వి.సుబ్బారెడ్డికి, మీకు, విషయ పరిజ్ఞానం వున్నోళ్లకు తెలుసు, నాకు తెలియదుగా, అందుకే ట్వీట్ చేస్తున్నా అని తన లోకంలో తాను చెప్పేశాడు. చంద్రబాబు ఉండి.. నేను ఆంధ్రప్రదేశ్‌కు వెళుతున్నా అని అన్నాడు. వెంటనే లోకేష్... అదేంటి నాన్నారు, అక్కడికి వెళితే మిమ్మల్ని 14రోజులు క్వారంటైన్‌లో పెడితే... అదీగాక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిమ్మల్ని రమ్మని కోరలేదు కదా అనే ధర్మ సందేహం వెలిబుచ్చాడు. దానికి చంద్రబాబు... ఒక పెన్ను పేపరు తీసుకో అని లోకేష్‌కు చెప్పాడు. లోకేష్ అలాగే చేశాడు. నేను చెప్పింది రాయ్ అని చంద్రబాబు ఆదేశించాడు. లోకేష్ రాయడం మొదలుపెట్టాడు.

గౌరవనీయులైన మాజీ ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు గారికి, ఏపి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వ్రాసుకున్న ఉత్తరం...

ప్రస్తుతం కరోనా వైరస్ మన రాష్ట్రంలో విజృంభిస్తోంది... పరిపాలనానుభవం లేని నేను ఈ వైరస్‌ను నియంత్రించలేకపోతున్నాను. ఈ వైరస్‌ను నిలువరించాలంటే మీలాంటి పరిపాలనానుభవజ్ఞులు అవసరం... గతంలో అరచేతిని అడ్డుపెట్టి తుఫానులను సముద్రంలోనే పడుకోబెట్టిన ఘనాపాటి మీరు. కంటిచూపుతో సునామీలను ఆపిన ధీరులు మీరు.. ఒక్క అరుపుతో భూకంపాలను, చూపుడువేలు చూపించి వరదలను ఆపిన శూరులు మీరు.. ఈ కరోనా వైరస్‌ను కూడా మీరే ఆపగలరు. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రజల మీద దయవుంచి ఓ రెండు వారాలపాటు ఏపికి తాత్కాలిక సీఎంగా వుండాలని అభ్యర్థిస్తున్నాను.. మా కోరికను మన్నిస్తారనే ఆశతో...

ఇట్లు

మీ... వైయస్ జగన్మోహన్‌రెడ్డి.

లోకేష్ రాయడం అయిపోయాక చంద్రబాబు దానిని చేతిలోకి తీసుకుని ఇదిగో ఇన్విటేషన్ వచ్చింది, ఏపికి వెళుతున్నాను... మన పచ్చ మీడియాకు ఇన్ఫర్మేషన్ ఇవ్వండి... నన్ను చూసి ఏపిలో కరోనా వైరస్ చావుభయంతో పరుగులు తీస్తోందని. రోజూ మన పేపర్లలో, మన టీవీలలో ఇవే వార్తలు రావాలంటూ ముందుకు నడిచాడు...

వద్దు, నువ్వు రావద్దు... నువ్వు కాలు పెడితే రాష్ట్రం కాలిపోద్ది... వైరస్ పెరిగిపోద్ది... నీ లెటర్ నువ్వే రాసుకుని రావడం అన్యాయం అంటూ కేకలు వినిపించసాగాయి. ఆ కేకలు విని వైయస్ భారతి పరుగెత్తుకుంటూ వచ్చింది. నిద్రలో కలవరిస్తున్న తన భర్త జగన్మోహన్‌రెడ్డి ముఖంపై నీళ్ళు చల్లింది. లేచిన కొద్ది సేపటికి గాని జగన్‌కు అర్థం కాలేదు... అప్పటి దాకా వచ్చింది కల అని!

# పోలీసులంటే దేవుళ్లే

■ మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసిన ఆర్ఎస్ఆర్ ■



కరోనా కష్టకాలంలో మనందరి ప్రాణాలను కాపాడుతూ మన భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, వారి కుటుంబాలను వదలిపెట్టి, రోడ్లమీద మండేఎండలో మనకోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులు సాక్షాత్తూ దేవుళ్ళేనని, వారందరికీ కృతజ్ఞతాపూర్వకంగా పాదాభివందనాలు తెలియజేస్తున్నామని నెల్లూరు వైఎస్సార్సీపి నాయకుడు శ్రీనివాస్ (ఆర్ఎస్ఆర్) అన్నారు. ఈనెల 6న ఆయన ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌కు సంబంధించి 150మంది పోలీసు సిబ్బందికి 450 మాస్కులు, 150 శానిటైజర్లు, 600గ్లౌజులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీచేశారు. స్టేషన్ సిఐ సుబ్బారావు, ఎస్ఐలు లక్ష్మణ్, పుల్లారెడ్డిలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మనకోసం ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న పోలీసులకు తమవంతు ఉడతాభక్తిగా ఈ చిన్ని సాయం అందజేశామన్నారు. ఈ కరోనా విపత్కర పరిస్థితుల్లో పేద ప్రజలకు ఎంతో సేవచేస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఎంఎల్‌ఏ కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల సూచనలతో, వారి స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పోలీసులు చేస్తున్న కష్టానికి మనం ఎంత చేసినా తక్కువేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ ఇన్‌చార్జి చేజర్ల మహేష్‌బాబు, వైయస్సార్సీపి నాయకులు కృష్ణమోహన్‌రెడ్డి, ఆనంగి రమణయ్య, దిలీప్‌రెడ్డి, పోతురాజు రవి, ఒంగోలు సురేష్, డిష్ శ్రీను, బొమ్మన శీనయ్య, కొండాయపాళెం కిషోర్, హైదర్స్ శివ పాల్గొన్నారు.

# ఆరోగ్యం కంటే ఆదాయమే ముఖ్యమా?

- చేవూరు విమర్శ



రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం కంటే మద్యం మీద ఆదాయమే ముఖ్యమైపోయిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. కరోనా వైరస్‌తో ప్రజలు సుదీర్ఘ పోరాటం చేస్తున్న తరుణంలో మద్యం అమ్మకాలకు ప్రభుత్వం అనుమతివ్వడాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టాడు. కరోనా వైరస్‌ను అదుపు చేయడం చేతకాక మద్యం అమ్మకాలకు అనుమతించడం దురదృష్టకరం. నిత్యావసర వస్తువులు, అత్యవసర మందులకు బయటకొచ్చిన జనాన్ని పోలీసులు చావగొట్టారు. మందుబాబులకు మాత్రం ఎల్లవేళలా స్వాగతం పలుకుతున్నారు. కరోనా వైరస్‌తో మనం సహజీవనం చేయక తప్పదని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లిక్కర్ అమ్మకాల ద్వారా కరోనాను అందరికీ అంటగట్టాలని చూస్తున్నట్లున్నాడని ఆయన ఎద్దేవా చేశాడు. రాష్ట్ర ప్రజల క్షేమం కోరే వాళ్ళే అయితే వెంటనే రాష్ట్రంలో మద్యం అమ్మకాలను నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశాడు.

# జిల్లాకు మరో జాయింట్ కలెక్టర్

నెల్లూరు జిల్లాకు మరో జాయింట్ కలెక్టర్ పోస్టును కేటాయిస్తూ ప్రభుత్వం ఈనెల 6న జిఓ విడుదల చేసింది. ప్రస్తుతం జిల్లాకు జేసీ-1, జేసీ-2 ఉన్నారు. అయితే పాలనలో మరిన్ని మార్పులు తీసుకువచ్చేందుకు, ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా సకాలంలో అందించేందుకు జేసీ-3 పోస్టును ప్రభుత్వం కేటాయించింది. కొత్త జేసీ పోస్టుకు ఐఎఎస్ అధికారిని నియమించనున్నారు.



మహాత్మా!..

# జగన్‌కు మంచిబుద్ధిని ప్రసాదించండి

- కోటంరెడ్డి శీనయ్య వినూత్న నిరసన



రాష్ట్రంలో మద్యం దుకాణాలు తెరచి పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ప్రభుత్వం చిచ్చుపెడుతోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ రాష్ట్రాన్ని రావణకాష్టంగా చేస్తున్నారని టిడిపి నెల్లూరు నగర అధ్యక్షుడు, నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించారు. ఇకనైనా ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలంటూ గాంధీ విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి మహాత్ముని అభ్యర్థించాడు. వినూత్న రీతిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టాడు. ఈ నెల 6న నెల్లూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శీనయ్య మాట్లాడుతూ జగన్ తీసుకుంటున్న చేతగాని నిర్ణయాల వల్ల మధ్యతరగతి కుటుంబాలు చితికిపోతున్నాయని, మద్యం అమ్మకాల వల్ల మరణాలు, గృహహింసలు పెరిగిపోతున్నాయన్నాడు. వెంటనే ప్రభుత్వం మద్యం అమ్మకాలు ఆపెయ్యాలన్నాడు. కరోనా మహమ్మారిని నివారించేందుకు వైద్యులు చేస్తున్న కృషి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతోందన్నాడు. మద్యం అమ్మకాలతో కరోనా కేసులు మరింతగా పెరిగిపోతాయన్నాడు. మద్యం రేట్లు భారీగా పెంచడంతో మందుబాబులు మద్యం కొనుగోలుకు వెనుకాడడం లేదని, దీంతో వారి కుటుంబాలు గుల్లవుతున్నాయని అన్నాడు. తన చిన్నాన్న వివేకానందరెడ్డి మృతికి కారణాలు కనిపెట్టలేని ముఖ్యమంత్రి ఇక రాష్ట్ర ప్రజలను ఎలా కాపాడగలుగుతారని విమర్శించాడు. వారం రోజులు చంద్రబాబు నాయుడుకు అధికారం ఇస్తే రాష్ట్రంలో పరిస్థితిని అదుపులోకి తెస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ధర్మవరం సుబ్బారావు, పడవల కృష్ణమూర్తి, పిట్టి సత్యనాగేశ్వరరావు, మహేంద్రరెడ్డి, ఆకుల హనుమంతరావు, పసుపులేటి మల్లికార్జున, మురళి, సుకేశ్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి గుడి

# ఏ.సిగా శ్రీనివాసరావు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారిగా జె.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఏ.సిగా వున్న వేగూరు రవీంద్రరెడ్డి నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మేనేజర్ గిరికృష్ణ, సిబ్బంది ఫణి తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ల బదిలీలు నిర్వహించాలి

లాక్‌డౌన్ ముగిశాక డిఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత సెలవుల్లోనే ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలని, ఈ బదిలీలు నిర్వహించిన తర్వాతనే డిఎస్సీ-2018 నియామకాలు, కొత్త డిఎస్సీ నిర్వహించాలని ఎస్‌జిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో కోరారు. గత మూడేళ్లుగా ఉపాధ్యాయుల బదిలీలు జరగలేదని, ఒకే ప్రాంతంలో 8 నుంచి పదేళ్ళదాకా సర్వీసు పూర్తిచేసి బదిలీల కోసం వేలాదిమంది ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# 3వేల మాస్కులు అందజేత

నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ పీవీవీయస్ మూర్తికి నౌకాదళ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ జీవిస్ యుగంధర్‌రెడ్డి ఈనెల 4న మూడు వేల మాస్కులను అందజేశారు. ఎన్ సీసీ క్యాడెట్స్ తో తయారుచేసిన 25 వేల మాస్కుల్లో మిగిలిన వాటిని పోలీసు, ఆరోగ్యశాఖ సిబ్బందికి అందజేయనున్నట్లు యుగంధర్‌రెడ్డి తెలిపారు.

## పునఃప్రారంభంలో

# జాగ్రత్తలు తీసుకోవాలి



వై.వి.రామిరెడ్డి

సుదీర్ఘ లాక్‌డౌన్ మూలంగా మూతపడిపోయిన పరిశ్రమలను తిరిగి పునఃప్రారంభించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పారిశ్రామిక అనుమతుల కమిటీ సభ్యులు వై.వి.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీకేజీపై ఆయన విచారం వ్యక్తం చేశారు. మృతులకు తన సంతాపం తెలియజేస్తూ.. భవిష్యత్‌లో ఇటువంటి విపత్తులు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. లాక్‌డౌన్ వల్ల చాలారోజులుగా పరిశ్రమలు మూసివేసున్నారని, వీటిని తిరిగి తెరిచే సమయంలో నిపుణుల చేత తనిఖీ చేయించి ఎన్‌ఓసి పొందిన తర్వాతనే పరిశ్రమలు తిరిగి ఉత్పత్తులను ప్రారంభించాలన్నారు.

# నెలవారీ రీడింగ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు

విద్యుత్ బిల్లులను నెలవారీ రీడింగ్ ప్రకారమే అందజేస్తున్నామని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్‌రెడ్డి ఈనెల 5న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా ప్రభావంతో ఏప్రిల్ నెలలో రీడింగ్ తీయలేదని, మార్చి నెల బిల్లుల ప్రకారమే ఏప్రిల్ నెల బిల్లును చెల్లించాలని వినియోగదారులను కోరామని తెలిపారు. లాక్‌డౌన్ కొంత సడలింపు రావడంతో ఈనెలలో మీటర్ రీడర్లు విద్యుత్ రీడింగ్ తీస్తున్నారని, రెండు నెలల వినియోగానికి సంబంధించి మొత్తం యూనిట్లకు బిల్లు పడుతుందని, దీంతో టారిఫ్ పెరిగి వినియోగదారులపై అదనపు భారం పడుతుందని ప్రచారం జరుగుతోందని, అది వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెలలో తీసే రీడింగ్‌ను రెండు నెలలకు విభజించి నెలవారీ వాడకం మేరకే బిల్లు వేస్తారని ఆయన వివరించారు.

# మద్యం షాపులు మూసేయాలి

మద్యం షాపులను మూసేయాలంటూ సిపిఎం, దాని అనుబంధ సంఘాలు సిఐటియు, జేవివి, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఈనెల 6న దీక్ష చేపట్టారు. నెల్లూరులోని సిఐటియు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మద్యం షాపులు తెరవొద్దు..కరోనాను పెంచొద్దు..అంటూ ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు మద్యం షాపులు తెరవడంపై ఆందోళన వెలిబుచ్చారు. కరోనా వ్యాప్తి చెందుతున్న తరుణంలో మద్యం దుకాణాలు తెరవడం దారుణమన్నారు. ఇది ప్రభుత్వ అనాలోచిత చర్య అంటూ విమర్శించారు. నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అల్లాడి గోపాల్, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, రెహానాబేగం, ప్రసాద్, శివకుమారి, కొండా ప్రసాద్, సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

### సెప్టెంబర్ నెలాఖరుకు

# బ్యారేజీ నిర్మాణం పూర్తి

నెల్లూరు జిల్లాలోని సంగం బ్యారేజీ నిర్మాణం సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తవుతుందని తెలుగుగంగ ఎస్ఈ హరినారాయణరెడ్డి ఈనెల 4న తెలిపారు. పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయని, ఎడమవైపు గట్టు అనుసంధానికి అవసరమైన వంతెన కోసం సంబంధిత విభాగంతో చర్చిస్తున్నామని తెలిపారు. సోమశిల జలాశయం, సంగం ఆనకట్ట మధ్య 22 శాతం సాగునీటి వృధా జరుగుతుందని సోమశిల ఎస్.ఈ రవీంద్రరెడ్డి తెలిపారు. సంగం ఆనకట్టను ఆయన పరిశీలించారు.

# భారత్‌కు కలిసొస్తుందా?

(మొదటి పేజీ తరువాయి)

చైనాపై గుర్రుగా వున్నాయి. చైనా కావాలనే కరోనా వైరస్‌ను వదిలిందనే అనుమానాలూ ఆ దేశాలలో లేకపోలేదు. ఈ దేశాలన్నీ కూడా ఇప్పటికే చైనాలో భారీగా పెట్టుబడులు పెట్టి వున్నాయి. చైనాలో పెట్టుబడుల ఉపసంహరణకు ఈ దేశాలన్నీ సిద్ధమవుతున్నాయి. జపాన్ అయితే చైనాలో పెట్టుబడులు ఉపసంహరించుకునే తమ దేశ కంపెనీలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కూడా ప్రకటించింది. కాబట్టి త్వరలోనే చైనా నుండి అన్ని దేశాలు తమ పెట్టుబడులను తరలించడానికి సిద్ధమవుతున్నాయి. ఈ పరిస్థితిని ఇప్పుడు భారత్ తనకు అనుకూలంగా మలచుకోవాలి. కేంద్ర ప్రభుత్వం కూడా ఆ ప్రయత్నాల్లో వున్నట్లుగానే తెలుస్తోంది.

అమెరికా, జపాన్‌తో పాటు యూరప్ దేశాలన్నీ తమ పెట్టుబడులకు చైనా బదులు భారత్‌వైపు చూస్తున్నాయి. ఆసియా ఖండంలో చైనా తర్వాత పెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్. సురక్షితమైన దేశం కూడా! మోడీ నాయకత్వంపై ప్రపంచ దేశాలకు నమ్మకం కుదిరింది. ఈ కరోనా కాలంలో అన్ని దేశాలకు ఆపన్నహస్తం అందిస్తూ భారత్ పోషించిన పాత్ర కూడా అన్ని దేశాల ప్రశంసలందుకుంది. ఈ కరోనా సీజన్‌లో భారత్‌లో విదేశీ పెట్టుబడులకు ఒక సానుకూల వాతావరణం ఏర్పడింది. విదేశీ పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో 10లక్షల ఎకరాల భూమిని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇవన్నీ విజయవంతమైతే భారతీయులు ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్ళనవసరం లేదు... ఇక్కడే కావాల్సినన్ని ఉద్యోగాలు... అన్నీ అనుకూలిస్తే కరోనా భారత్‌కు వరమే అవుతుంది.

# భేషుగ్గా కూరగాయల సెంటర్లు

- కరోనా నియంత్రణలో విజయవంతమైన ప్రక్రియ



లాక్‌డౌన్ అమలులోకి వచ్చే ముందురోజు నెల్లూరులోని ఏ.సి కూరగాయల మార్కెట్‌ను చూస్తే అసలు కరోనాకు హాట్‌స్పాట్‌గా ఇదే వుంటుందేమో అనిపించింది. ఆరోజు అంత రద్దీగా వుండింది. భౌతిక దూరం లేదు... మూతులకు మాస్క్‌లు లేవు... నగరంలో కూరగాయల కొనుగోలుకు అవకాశం వున్న ఏకైక మార్కెట్. రెండు రైతుబజార్లు వున్నప్పటికీ ప్రజలు అక్కడికి పోరు. కూరగాయల కొనుగోళ్ళకు ఏ.సి కూరగాయల మార్కెట్టే దిక్కు!

లాక్‌డౌన్ అమలులోకి వచ్చిన రోజు నుండి ఏసి కూరగాయల మార్కెట్‌ను తెరిచే అమ్మకాలు సాగించి వుంటే కరోనావైరస్ వ్యాప్తికి ఇదో పెద్ద హబ్ అయ్యేది. కాని పరిస్థితిని పూహించే కూరగాయల మార్కెట్‌ను పూర్తిగా మూసివేయడం, నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల పరిధిలో 120 కూరగాయల సెంటర్లు ఏర్పాటు చేయడం మంచి ఫలితాలనే అందించింది. ఈ విషయంలో నెల్లూరు నగరం, రూరల్ ఎమ్మెల్యేల కృషితో పాటు ఏసి కూరగాయల మార్కెట్‌లో అనుభవం వున్న వైసిపి నాయకుల సహకారం కూడా ఎంతైనా ఉందని చెప్పవచ్చు!

సాధారణంగా ఏ.సి కూరగాయల మార్కెట్‌పై పబ్లిక్‌లో కొంత వ్యతిరేక భావం వుంటుంది. తూకాలు సరిగా వుండవని, వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తారని, రేట్లు ఇష్టం వచ్చినట్లు చెబుతుంటారనే ఆరోపణలున్నాయి. కాని నగర, రూరల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ విజిటబుల్ స్టాల్స్‌లో మాత్రం సలీసు ధరలకే కూరగాయలు లభించడం, వినియోగదారులతో సౌకర్యవంతంగా వ్యవహరించడం ద్వారా... అసలు ఈ కూరగాయల స్టాల్స్‌ను లాక్‌డౌన్ తర్వాత కూడా కొనసాగిస్తే బాగుంటుందనే అభిప్రాయం ప్రజల్లో నెలకొనివుంది.

# వైరస్‌తో చిందులు

(మొదటి పేజీ తరువాయి)

ఒకటిన్నర నెల పాటు లాక్‌డౌన్‌ను చిత్తశుద్ధితో అమలు జరిపారు. అన్ని రాష్ట్రాలకంటే ఏపిలో పకడ్బందీగా అమలు చేస్తున్నారనే పేరు కూడా వచ్చింది. అయ్యప్ప మాల ధరించిన భక్తుల్లో కొందరు 41రోజుల పాటు నిష్ఠగావుండి, చివరిరోజు మద్యం తాగినట్లు... ఒకటిన్నర నెలపాటు రెండు రాష్ట్రాలలో నిష్ఠగా అమలుచేసిన లాక్‌డౌన్ ఫలితం బ్రాందీషాపులు తీయడంతో గాలికి కొట్టుకుపోయింది. రాష్ట్రాలలో బ్రాందీషాపులు తెరవడంతో కరోనా వైరస్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ కూడా మటు మాయమయ్యాయి. బ్రాందీషాపుల ముందు జనజాతరే అయ్యింది. కిలోమీటర్లకొద్దీ క్యూలైన్లు... తోపులాటలు... భౌతిక దూరం లేదు... శానిటైజర్లు లేవు... కొన్ని వందల బ్రాందీషాపుల ముందు లక్షల సంఖ్యలో మందు బాబులు... వీళ్ళల్లో ఒకరికి కరోనా పాజిటివ్ వున్నా... కొన్ని వేలసంఖ్యలో కేసులు పెరగడం ఖాయం.

### అసంబద్ధ నిర్ణయం

లాక్‌డౌన్ సడలింపులలో భాగంగా మద్యం అమ్మకాలకు కేంద్రం పచ్చజెండా వూపింది. అయితే మద్యం షాపులు తెరవాలా? వద్దా? అన్నది రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణాధికారం మీద ఆధారపడి వుంటుంది. 45రోజులుగా మందుబాబులు మద్యం కోసం అల్లాడుతున్నారు. ఇలాంటి తరుణంలో మద్యంషాపులు తెరిస్తే మందుబాబులు ఎంతగా ఎగబడతారో, అది ఎంత ప్రమాదమో తెలుసు. మందుబాబులను కంట్రోల్ చేసే పరిస్థితి కూడా వుండదు. ఇప్పుడు ఏపిలో అదే జరిగింది.

### మద్యం అమ్మకాలు అత్యవసరమా?

రాష్ట్రాలలో మద్యం అమ్మకాలను అంత అత్యవసరంగా మొదలుపెట్టాల్సిన అవసరం లేదు. తెలంగాణలో మద్యం దొరక్క చాలామంది మానసిక రోగులై ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో వున్నారు. అక్కడ కరోనా కేసుల కంటే ఈ కేసులే ఎక్కువగా వున్నాయి. అయినా తెలంగాణలో మద్యం అమ్మకాలకు అనుమతినివ్వకముందే ఏపిలో అమ్మకాలు చేయాల్సిన అవసరం ఏముంది. అదీగాక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి దశలవారీగా మద్యపాన నిషేధం అంటున్నాడు. ఈ సుదీర్ఘ లాక్‌డౌన్ కాలాన్ని అందులో ఒక దశగా వాడుకుని వుండొచ్చుకదా!

### ప్రణాళిక లేకే విమర్శలు

మద్యం దుకాణాలు తెరవాలనుకున్నప్పుడు... ముందుగా పరిస్థితిని అంచనా వేసుండాలి. దుకాణాలు తక్కువగా వున్నాయి కాబట్టి రద్దీ పెరిగే అవకాశముంటుంది. అందుకోసం నాలుగురోజుల పాటు ఊర్ల శివార్లలో ఎక్కువ సంఖ్యలో మద్యం కౌంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా రద్దీని నియంత్రించి వుండొచ్చు. లాక్‌డౌన్ నిబంధనలను కూడా పక్కాగా అమలు చేసి వుండొచ్చు.

### రేట్లు పెంచితే మానుకోవడం భ్రమే!

రెండు రాష్ట్రాలు గతంలోనే మద్యం రేట్లు పెంచింది. ఏపి ఇప్పుడు రెండు దఫాలుగా 75శాతం ధరలు పెంచింది. రేట్లు పెరిగితే మందుబాబులు మద్యం తాగడం తగ్గిస్తారని, లేదా మానేస్తారని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఇంతకంటే భ్రమ ఇంకోటి ఉంటుందా? ఏ వస్తువు రేటు పెరిగినా ప్రజలు వాటి కొనుగోలును తగ్గిస్తారేమోగాని... వ్యసనాల విషయంలో ఏ ఒక్కరూ ఖర్చుకు వెనుకాడరు. వ్యసనాల కోసం కోట్లాది రూపాయల ఆస్తులు పోగొట్టుకున్న ఘనులున్న సమాజం మనది.

ఇటు ఆంధ్రా, అటు తెలంగాణ రాష్ట్రాల్లో మద్యం షాపులు పెరగడం వల్ల మందుబాబులు మందలు మందలుగా వాటి ముందు మూగిపోయారు. కరోనా వైరస్ భయం వాళ్ళలో మచ్చుకు కూడా కానరావడం లేదు. వైరస్ నివారణకు మద్యాన్నే వాళ్లొక మందుగా భావిస్తున్నారు. ఇలా మందలు మందలుగా చేరిన జనంతోనే రెండు రాష్ట్రాలలో వైరస్ చిందులు వేయబోతోంది!

### కరోనాకలంలో...

# ఆత్మీయులతో వెంకయ్య మాటామంతి



కరోనా వైరస్ విజృంభిస్తున్న వేళ... లాక్‌డౌన్ మూలంగా దాదాపు 50రోజుల నుండి ప్రజలు ఇళ్ళకే పరిమితమైవున్నారు. భారత రాష్ట్రపతి మొదలుకొని సాధారణ పౌరుడు వరకు 'స్టే హోమ్ - సేవ్ లైఫ్' అంటున్నారు. ఇదే సమయంలో దేశ అత్యున్నత పదవుల్లో వుంటున్న నాయకులు ఈ కరోనా ఖాళీ సమయంలో తమ జీవిత పయనంలో పరిచయమైన ఆత్మీయులను ఫోన్‌ల ద్వారా పలుకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండంటూ సూచనలు చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఒకప్పటి తన సంఘ్ సహచరులకు, బీజేపీ మాజీ అధ్యక్షులకు, సీనియర్ నేతలకు ఫోన్‌లు చేస్తూ వారి క్షేమ సమాచారాలు తెలుసుకుంటున్నారు.

భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు కూడా విద్యార్థి దశ నుండి నేటి దాకా తన రాజకీయ, రాజ్యాంగ జీవన ప్రస్థానంలో పరిచయమైన ఎంతో మంది ప్రముఖులు, ఆత్మీయులకు రోజూ ఫోన్‌లు చేస్తున్నారు. వారిని ఆత్మీయంగా పలుకరిస్తున్నారు. ముఖ్యంగా తన జన్మభూమి నెల్లూరుజిల్లాలో పలువురు రాజకీయ, పత్రికా రంగం, వ్యాపార, వాణిజ్య ప్రముఖులకు ఆయన ఫోన్‌లు చేసి యోగక్షేమాలు కనుక్కున్నారు. ఆయన 1978, 1983లలో ఉదయగిరి శాసనసభ్యులుగా పని చేశారు. ఆ కాలంలో పరిచయమైన వ్యక్తులను కూడా ఆయన మరచిపోలేదు. అప్పట్లో తనతో ఆత్మీయంగా వున్న ఎంతో మంది ఉదయగిరివాసులను కూడా వెంకయ్య ఫోన్‌లో పరామర్శిస్తున్నారు. భారతదేశ రెండోపౌరుడి హోదాలో వున్న వెంకయ్యనాయుడు స్వయంగా ఫోన్‌లు చేసి తమ క్షేమసమాచారాలు, జిల్లాకు సంబంధించిన విషయాలు అడుగుతుండడంతో, ఆ ఆత్మీయ పలకరింపుకు నోచుకున్న వాళ్ళు ఆనంద పరవశులవుతున్నారు.

# కరోనా కేసులు పెరిగాయి

- కొత్తగా మరో నలుగురికి
- 96కు చేరిన పాజిటివ్ కేసులు




నెల్లూరు నగరంలోని కోటమిట్ట ప్రాంతంలో ఈనెల 6న మరో నలుగురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో జిల్లాలో పాజిటివ్ కేసుల సంఖ్య 96కు పెరిగింది. పాజిటివ్ కేసులు నమోదైన వారిలో ఒకే ఇంట్లో ఇద్దరికి, మరో ఇంట్లో ఇద్దరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ కావడంతో వారిని వెంటనే ఐసొలేషన్‌కు తరలించారు. హాట్‌స్పాట్‌గా ఉన్న కోటమిట్ట, ఖుద్దూస్‌నగర్ ప్రాంతంలోనే కొత్తకేసులు నమోదు కావడంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు నమోదైన కేసుల్లో 59 మంది కోలుకొని డిశ్చార్జి కాగా, ముగ్గురు మరణించారు. మిగిలిన 34 మంది చికిత్స పొందుతున్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో అనుమానితుల నుంచి పిసిఆర్, ట్రూనాట్ పద్ధతిలో ఇప్పటిదాకా 13,159 మందికి పరీక్షలు చేయగా, వీరిలో 10,687 మందికి నెగటివ్ రాగా, 97 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. 2375 మందికి సంబంధించిన వైద్యపరీక్షల ఫలితాలు రావాల్సి ఉంది. వీరు కాక, మరో 4వేల మంది దాకా ర్యాపిడ్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించారు. ముందస్తుగా కోవిడ్ పరీక్షలు చేయించుకునేవారికి పెద్దాసుపత్రిలో స్వాబ్ తీస్తున్నారు.

**క్వారంటైన్‌లో 216 మంది**

జిల్లాలో ప్రస్తుతం 19 సెంటర్లలో 216 మంది క్వారంటైన్‌లో ఉన్నారు. మరో 34మంది ఐసొలేషన్లో ఉండగా, విదేశాల నుంచి వచ్చి హోం క్వారంటైన్‌లో ఉన్నవారు మరో నలుగురు ఉన్నారు.

### విషవాయువుతో...

# విశాఖలో విషాదం



- రసాయన వాయువు లీకేజీతో 10మంది కన్నుమూత
- వందలాదిమందికి అస్వస్థత
- ప్రాణభయంతో పరుగులు తీసిన ప్రజలు

ఒకవైపు కరోనా మహమ్మారి కరాళనృత్యం చేస్తున్న నేపథ్యంలో దేశమే విపత్కర పరిస్థితుల్లో ఉన్న తరుణంలో..విశాఖపట్నంలోని ఒక పరిశ్రమలో గ్యాస్ లీకేజీతో రసాయన వాయువులు వెలువడి పలువురు మృతిచెందడం, వందలాదిమంది అస్వస్తతకు గురికావడం దేశవ్యాప్తంగా ప్రజలను ఆందోళనకు గురిచేసింది. ఈనెల 7వ తేది వేకువన జరిగిన ఈ దుర్ఘటనతో విశాఖ ప్రజలు ప్రాణభయంతో వణికిపోయారు. ఏమి జరిగిందో తెలుసుకునేసరికే అనేకమంది ఊపిరాడక అస్వస్థులైపోయారు. పలువురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితులను అదుపులోకి తెచ్చారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.









వేకువన సుమారు 4 గంటల సమయం.. అందరూ గాఢనిద్రలో ఉన్న వేళ.. విశాఖపట్నం జిల్లాలోని ఆర్ఆర్ వెంకటాపురంలోని ఎల్జీ పాలిమర్స్ పరిశ్రమలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. పరిశ్రమ నుంచి పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో పాటు కెమికల్ గ్యాస్ లీకవడంతో సుమారు మూడు కిలోమీటర్ల దాకా రసాయన వాయువు వ్యాపించింది. దీంతో ఈ వాయువు బారినపడకుండా ఇళ్లను ఖాళీ చేయాల్సిందిగా ప్రజలను హెచ్చరిస్తూ పోలీసులు సైరన్‌లు మోగించారు. జనం ఇళ్ళలోంచి ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. రసాయనం ప్రభావంతో ఒంటిపై దద్దుర్లు, కళ్లల్లో మంటలు వచ్చి అనేకమంది ప్రజలు శ్వాస తీసుకోవడానికి తీవ్ర అవస్తలు పడ్డారు. కొందరు అస్వస్తతకు గురై అపస్మారకస్థితిలో రోడ్డుపై పడిపోయారు. అనేకమందిని విశాఖ ఆసుపత్రికి తరలించారు. గురువారం సాయంత్రానికి అందిన సమాచారం ప్రకారం ఈ రసాయన వాయువు లీకేజీ వల్ల 10 మంది మృతిచెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వీరు ప్రాణాలు కోల్పోయారు. కనీసం 2వందల మందికిపైగానే తీవ్ర అస్వస్తతకు గురైనట్లు సమాచారం. పెద్దసంఖ్యలో పశువులు తదితర మూగ జీవాలు ఈ విషవాయువుల ధాటికి మృతిచెందాయి. రసాయన వాయువు పీల్చినవారు ఎక్కడికక్కడే కూలబడిపోతున్న దృశ్యాలు ఎంతో దయనీయంగా ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే అధికారులు హుటాహుటిన ఆ ప్రాంతాన్ని సందర్శించి, ఆ ప్రాంతాల ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించారు.

## మృతులకు కోటి నష్టపరిహారం.. దేశ చరిత్రలోనే ప్రప్రథమం



ప్రమాదం గురించి తెలియగానే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి హుటాహుటిన విశాఖపట్నం చేరుకున్నారు. కెజిహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఆయన కోటి రూపాయల లెక్కన భారీ నష్టపరిహారం ప్రకటించారు. దేశ చరిత్రలోనే ఇంత భారీ నష్టపరిహారం ప్రకటించిన తొలి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డే! భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు తలెత్తితే బాధితులకు ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో ఆదుకునే విధంగా జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం ఉంది. అలాగే ఐసియులో వున్నవారికి 10 లక్షల రూపాయలు, ప్రమాదం బారినపడ్డ వారికి లక్ష వంతున ఆర్థిక సహాయం ప్రకటించడమేకాక, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ఎంత డబ్బయినా వైయస్సార్ ఆరోగ్యశ్రీ క్రింద ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు.

## విచారణ జరిపిస్తాం - పరిశ్రమల మంత్రి మేకపాటి

ఈ ఘటనపై విచారణ జరిపిస్తామని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి వెల్లడించారు. బాధితులు ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలందిస్తామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. గ్యాస్ లీక్ వల్ల ఉన్నఫళంగా ఇళ్ళను వదిలేసి వెళ్ళిపోయిన ప్రజలకు ఏ లోటూ లేకుండా చూడాలని విశాఖ కలెక్టర్ వినయ్‌చంద్‌కు సూచించారు. జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలని పరిశ్రమలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్‌ను మంత్రి ఆదేశించారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com